# II రేపటి స్వర్గం II

(ఆధునిక సంగీత నాటకము)

రచన

శ్రీ మొదలి నాగభూషణ శర్మ

రసరంజని రంగస్థల గ్రంథాలయము

భాగ్యనగరము * తెలంగాణ * భారతదేశము

## II మనవి II

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో గల వివిధ - పద్య, గద్య - నాటకములు, నాటికలు, రంగస్థల గ్రంథములు - ప్రస్తుతం లభ్యములు, అలభ్యములు అయినవి - **DTP** చేయబడుచున్నవి. అట్లే వివిధ రచయిత(త్రి)ల, ముద్రణాలయముల అనుమతి తీసుకొనక పోయిననూ ఇప్పటికి లభ్యమైన, అలభ్యమైన నాటక గ్రంథములు సేకరించి, ఆ గ్రంథములలో అక్షరములు అస్పష్టతగా ఉండుట వలన, స్పష్టత కొఱకు, అక్షర దోషములు లేకుండ **DTP** చేసి, **PDF** లు గా మార్చబడుచున్నవి.

ఈ ప్రయోగము కేవలం తెలుగు నాటక సమాజముల వారికి, నాటక దర్శకులకు, నటీనటులకు, నాటక ప్రియులకు, ఇతర గ్రంథాలయములకు, ముద్రణాలయముల ఉపయోగార్థము చేయబడుచున్నవి.

ఈ **DTP** చేయబడిన నాటక గ్రంథముల ప్రతులు మాత్రమే **A4** సైజు లో "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో పొందవచ్చును. ఇవి **PDF**లు గా మాత్రమే ఇవ్వబడును. ఈ **DTP** చేయబడిన నాటక/నాటిక/రంగస్థల గ్రంథములు వ్యాపార దృక్పధంతో చేయుచున్నవి కాదు.

అట్లే ప్రతి గ్రంథము పై **"Copyright"** చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథమును ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత(త్రి) లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను. ఇందులో "అనుమతి పత్రము" నమూనా కూడా జత పరచడమైనది అని తెలుపుట గమనించగలరు.

ఇది "రసరంజని రంగస్థల గ్రంథాలయము" సంస్థ చేయు తెలుగు రంగస్థల సేవగా రచయిత(త్రి)లు, ముద్రణాలయములు భావించ ప్రార్థన.

రచనల సేకరణ కొనసాగుతున్నది. రచయిత(త్రు)లు తమ విలువయిన రచనలను, సేకరణలను ఫోటో కాపీ రూపములోనయినా సరే మా "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు అందించి సహకరించ ప్రార్థన.

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు సాదరంగాను, అభిమానంతోనూ, తమ వద్ద నున్న నాటక గ్రంథముల ప్రతులను అందించి మమ్ము ప్రోత్సహిస్తున్న, మహానుభావులకు మా హృదయపూర్వక ధన్యవాదములు !

రసరంజని రంగస్థల గ్రంథాలయము

## II అనుమతి పత్రము II

తేదీ : ..................................

ఈ “రేపటి స్వర్గం” ఆధునిక సంగీత నాటకమును ప్రదర్శించుటకు

**M/s ...............................................................................................................**

**(**సమాజము పేరు**)**

నాటక సమాజము వారు మా అనుమతి కొరకు మమ్ము సంప్రదించుటచే, ఈ నాటికను వారు అత్యంత శ్రద్ధతో ప్రదర్శించెదరని ఆశిస్తూ, మా అనుమతిని లిఖిత పూర్వకము గా నిస్తున్నాము. వారి ప్రదర్శన దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నాము.

ఇట్లు

మొదలి నాగభూషణ శర్మ

రచయిత

రచయిత చిరునామా :

..............................................

.........................................

..............................................

..............................................

---

**Copyright** చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథములను ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత**(**త్రి**)** లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను.

అందుకై ఈ "అనుమతి పత్రం" జత పరచడమైనది.

# ।। రేపటి స్వర్గం ।।

(ఆధునిక సంగీత నాటకము)

## ।। పాత్రలు ।।

దొర

ముక్కు మనిషి

బొక్కసం వీరాస్వామి

కామందు కనకయ్య

పిచ్చిమారాజు

మంత్రి కేతినాయుడు

సేనాని మీసాల అప్పలరాజు

పూలపిల్ల

టీకొట్టు తిరపతమ్మ

టింగరి

యువకుడు

తుపాకీ రాముడు

పాటగాడు జముకుల బసవయ్య

ముసలి పోలీసు వెంకటస్వామి

పడుచు పోలీసు

మూగ బ్రహ్మయ్య

గ్యాని

మేస్త్రీ నరసింహ

ఇంకా – 3 దొరలు, 2 ముక్కు మనుషులు, 3 పత్రికలవాళ్ళు, ఊళ్ళో జనం -

## ॥ రేపటి స్వర్గం ॥

(ఆధునిక సంగీత నాటకము)

### ॥ మొదటి రంగం ॥

### ॥ తెర వెనుక ప్రార్థన గీతం ॥

తుండము నేకదంతమును తోరపు బొజ్జయు వామహస్తమున్

మెండుగ మ్రోయుగజ్జలును మెల్లని చూపులు మందహాసమున్

కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజయై

యుండెడు పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్

(ఒక ఊళ్ళో అమ్మవారి జాతర జరుగుతోంది ... ఊరివాళ్ళు - చిన్నా పెద్దా - నైవేద్యాలు తీసుకుని పోతున్నారు ... అందరూ పాటలు పాడుకుంటూ నడుస్తున్నారు)

### ॥ ఆవాహన గీతం ॥

### ॥ ప్రావేశికిధ్రువ ॥

ఊరంత పండగ చేస్తోంది

అమ్మోరి సంబరానికై ॥ ఊ ॥

ముందొచ్చే మంచి రోజులకు

మనసంతా ఉరకలు వేస్తోంది ॥ ఊరంత ॥

ఆవేశాలు, కావేషాలు మరిచి

మనమంతా ఒకే తాటిపై నిలిచి

సుఖదుఃఖాలలో కలిసి బతుకుదాం

కలిసి బతకడమె రేపటి స్వర్గం ॥ ఊరంత ॥

మంచి నలుగురూ పంచుకోవడం

ఉన్నదానితో తృప్తి చెందడం

అన్యాయాన్నెదిరించి నిలవడం

శ్రమశక్తి గుర్తింపు పొందడం

రేపటి స్వర్గం, రేపటి స్వర్గం

మంచిని మరికొంచెం పెంచి

మమతకు నువు పట్టం కడితే ॥ రేపటి స్వర్గం ॥

రేపటి స్వర్గం, రేపటి స్వర్గం ॥ ఊరంత ॥

(అమ్మవారి గుడి వెలపల ఓ పక్క చిన్న చిన్న దుకాణాలు ... టీకొట్టు తిరపతమ్మ టీ దుకాణం ... టీకొట్టు పక్కగా ఒక మంచం, మరోపక్క ఒక గడ్డవాయన తంబురా పుచ్చుకొని తనలో తాను పాడుకొంటున్నాడు.

ఊరి జనంలో కొందరు గుడి దగ్గర వేరే వేరు పనుల్లో నిమగ్నమౌతారు ... జముకుల బసవయ్య టీ తాగి తన జముకును శృతి చేస్తూ వుంటాడు ...

పూలపిల్ల పూలు అమ్ముతూ వుంటుంది ... ఒక మూగవాడు వచ్చి అందర్నీ పలకరిస్తుంటాడు.

తిరపతమ్మ పొయ్యిలో పిడకలు వేసి, మంచి నీళ్ళ బిందె తెచ్చిపెట్టి, పూలపిల్ల చుబుకం పట్టుకుని ముద్దు పెట్టుకుని అమ్మవారి గుడికి వెడుతుంది ... ఆమె గౌరీదేవికి దణ్ణం పెట్టుకుని, హారతి యిస్తుంది ... వచ్చిన ఊరిజనం తలకొక రకంగా దణ్ణాలు పెడుతున్నారు.

జనం రావడం మొదలు పెడతారు ... కొబ్బరికాయల వాళ్ళు, పసుపు కుంకుమలు, పూలు అమ్మేవాళ్ళు - వస్తున్న జానానికి "రండి" "రండి" అంటూ తమ వస్తువులు అమ్మజూపుతారు ... జముకుల బసవయ్య జముకు మోగిస్తూ పాట మొదలు పెడతాడు ... అక్కడ పనిచేస్తున్న జనం తాము వాడే పనిముట్లనే వాయిద్యాలుగా చేసుకొని సహకారం అందిస్తారు)

॥ ఆహ్వాన గీతం ॥

॥ ఔత్సుకధ్రువ ॥

బసవయ్య : రండి రండి రండి రండి రండీ రండి

అందుకోండి అందుకోండి అందరూ మా దండాలు

మా అందరి దండాలు ॥ రండి ॥

గడుసుదనం తెలియనోళ్ళము

కరుకుదనం ఎరగనోళ్ళము

తెల్లని వన్నీ పాలని తేలికగా నమ్మేటోళ్ళం ॥ రండి ॥

(ఒక దొరగారు ఠీవీగా వచ్చాడు ... ఆయన గొడుగు పడుతూ బొక్కసం వీరాస్వామి, వెనకాల చేతులు నలుపుకుంటూ ఆ వూరి కామందు కనకయ్య)

అరె ! పెద్ద దొరలు వచ్చారే ! దండాలండి !

పెద్ద దొరల వెనకాలే పెత్తందారులు - రండి !

అమ్మోరి దయవల్ల అందరు సూఖముండాలి

నలుగురికీ మేలుచేసే మంచి మనసు నివ్వాలి

మంచి చెయ్యకుంటె మానె - మారణహోమం వద్దు ॥

దండాలు దండాలండి

దయవుంచి కాపాడండి ॥

(అందరూ వచ్చివాళ్ళ చుట్టూ చేరి నృత్యం చేస్తారు ... కామందు కనకయ్య దూరంగా ఉండండని హెచ్చరిస్తాడు ... వీరాస్వామి దొరకు కాపుదలగా ఉన్నాడు ... దొర వాళ్ళను కసురుకొని మరో వైపుకు వెళ్ళాడు)

దొర : ఏమయ్యా కనకయ్యా ! పెద్ద కామందువి ... ఊళ్ళో అందరికీ నిన్ను చూస్తే హడలన్నావే ! ఏమిటయ్యా ఇదంతా ?

కనకయ్య : అయ్యా ! ఇదంతా సంబరాలప్పుడు మామూలే నండి ! ఓ రూపాయి బిళ్ళ విసిరెయ్యండి ... ఈగలన్నీ మీ చుట్టూ మూగుతాయి !

వీరాస్వామి : కనకయ్యతో మాట్లాడితే మనం యిక్కడ నుంచి తొందరగా వెళ్ళిపోవచ్చు ... ఇక్కడ తమకు అనుకూలంగా ఉంటుందనుకోను ...

కనకయ్య : ఇంతకి తమరు కబురు చేసిన పని -

వీరాస్వామి : కనకయ్యా ! దొరగారు పట్టణం నుంచి పట్టుపరుపులు నుంచి నీ కోసం వచ్చారంటే నువ్వెళ్ళి గారెల బుట్టలో పడ్డట్టే గదూ ?

కనకయ్య : దొరగారి మంచి మనసు నాకు తెలియదూ ?

వీరాస్వామి : ఎట్టా తెలుసునయ్యోవ్ ?

కనకయ్య : (నవ్వుతూ) నువు జెప్పలేదుటయ్యా ! పరియాచకాలు ఆపి, అయ్యగారు ఎందుకు పిలిపించారో నువ్వన్నా చెప్పరాదూ ?

దొర : చూడు కనకయ్యా ! నీక్కూడా మాలాగానే గొప్ప గొప్ప ఊహలున్నాయని, ఈ చిన్న ఊళ్ళో అంత పెద్ద ఆశలున్న మనిషివి నువ్వేనని మా వీరాస్వామి చెప్పాడు.

కనకయ్య : చిత్తం ... తమ దయ వుంటే వచ్చే తూరి కూడా నేనే సర్పంచి నవ్వాలని వుందండి ...

దొర : సర్పంచినా ... అబ్బే ! వీరాస్వామీ ! ఈయనని తప్పుగా అంచనా వేశావయ్యా !

కనకయ్య : అదేమిటయ్యా ?

దొర : అవునయ్యా ! ఇప్పుడు నువ్వు సర్పంచివేగా ? ఇప్పుడు నువ్వేం కోరుకోవాలి ? ... మండలి అధ్యక్షుడు ... జిల్లా పరిషత్ చైర్మన్ ... ఎమ్.ఎల్.ఏ. ...

(దొర ఆ పదవుల సంగతి చెబుతున్నప్పుడు - అవే మాటలు అంటూ అంతకంతకూ పొంగిపోతూ వుంటాడు కామందు కనకయ్య)

కనకయ్య : అమ్మో ! అమ్మో ! నా మనసు చూసినట్టు చెబుతున్నారు దొరగారు !

వీరాస్వామి : మరేటనుకున్నవ్ ? ... దొరగారేమో - ఏమోయ్ ఈరాసామీ ! ఈ ఊరు వచ్చింది ... మనుషులంతా గోవుల్లా వున్నారు ... ఈ వూళ్ళో మనకు నచ్చే వాడెవడో తెలుసుకురా - అన్నారు ... అప్పుడొచ్చా నీ వూరు ... మా బామ్మరిదిని - అదే మీ వీది మొగాన కట్టెలడితీ - నాగరాజు నడిగాను ... నన్ను తీసుకుపో బావా - అన్నాడు ... ఒరేయ్ ! అట్టాంటోళ్ళు, ఇట్టాంటోళ్ళు నప్పుతారంట్రా మా దొరగారికి ... ఆయనకి ప్రాణమిచ్చే మడిసెవరు - అని అడిగాను ... అయితే మా కామందు కనకయ్య ను తీసుకుపో అన్నాడు ... అధ్గదీ ! అప్పుడు గలిశాను నిన్ను!

కనకయ్య : అల్లగంటయ్యా ! ఆ సంగతి నాకు చెప్పలేదే ?

(టింగరి - 12 ఏళ్ళ పిల్లాడు - పల్లీలమ్ముకుంటూ)

టింగరి : పల్లీలండీ ! గరం గరం పల్లీలు ! ... కాలక్షేపం పల్లీలు ... తీసుకోండి బాబు !

(వాడు దొర దగ్గరకు వచ్చి "పల్లీలండీ, గరం గరం పల్లీలు" అని అరుస్తాడు ... దొర విసుక్కుని దూరంగా జరుగుతాడు ... వాడు మళ్ళీ ఆయన దగ్గరకు వెళ్ళి "పల్లీలండీ !" అంటాడు)

దొర : ఏమిటయ్యా ఈ న్యూసెన్సూ ?

(మరో పక్కకి వెడతాడు ... గొడుగు పట్టుకుని బొక్కసం వీరాస్వామి ఆయనతో వెడతాడు ... కామందు కనకయ్య ఆగి టింగరిని తర్జనితో భయపెట్టి వెడతాడు ... ఆయన అటు తిరగగానే ఆయన దగ్గరికే వెళ్ళి "పల్లీలండీ పల్లీలు" అని అరుస్తాడు ... కామందు కనకయ్య వాడి వెంట పడి తరుముతాడు ... వాడు

పారిపోతాడు)

దొర : ఒట్టి పోకిరీ మనుషుల్లా ఉన్నారే ... !

కనకయ్య : పండగ కదా ! కాస్త హుషారుగా ఉన్నారు ... అట్టయితే దొరగారూ ! ఈరాసామి భలేవోడండీ ! యీ యిసయాలేమీ నాతో చెప్పనేలేదే ?

వీరాస్వామి : (నవ్వి) నాకే తెల్దు కామందుగోరూ ! ... ఓ వారం ఆగాక మళ్ళీ ఎల్ల మన్నారండి దొరగారు ... ఈ సారి ఈ హెూల్ మొత్తం ఊళ్ళో తనకి లాబం వస్తే ఎంతటోళ్ళనయినా ఒగ్గేసే వాడెవడో కనుక్కు

రమ్మన్నారండీ ... నీ పేరు జెప్పానండి కనకయ్యగోరూ !

(సోడాలమ్ముతూ వస్తాడు టింగరి)

టింగరి : సోడా అండి సోడా - డబుల్ గ్యాస్ సోడా - గాట్టైన సోడా ! సోడా అండి సోడా -

దొర : ఇక్కడ అన్నీ అమ్మడానికి వీడికొక్కడికే లైసెన్సు యిచ్చినట్టున్నారే !

కనకయ్య : (వాడిని అక్కడి నుంచి పొమ్మని గద్దిస్తూ) వాడికి అమ్మనాన్నా ఎవరూ లేరండీ ! ఆ తిరపతమ్మే కాస్త గంజి పోస్తోంది.

దొర : ఒక్కరికీ మంచీ, మర్యాదా తెలిసినట్టు లేదు ...

(ఒక పూలపిల్ల వస్తుంది ...)

పూలపిల్ల : మల్లెపూలూ, గులాబీ పూలూ, చామంతి పూలూ ... తీసుకోండి బాబూ ! ... అమ్మోరి పూజకు దండలున్నాయండీ ...

(సన్నంగా పాడుకుంటూ మధ్యలో ... పూలు ... మల్లెపూలు ... సన్నజాజులు ... అని అరుస్తుంది)

మల్లెపూల పూజ చేతును మంచి మగడిని ఇవ్వవే

సన్న జాజులు మాలవేతును చందమామనె ఇవ్వావే

(తనకు తానే నవ్వుకుని ఒక గులాబీని పట్టుకుని దొర దగ్గరగా పోయి)

మీ కోటులోకి ఈ గులాబీ తీసుకోండి దొరగారూ !

వీరాస్వామి : అయ్యగారిని దొరగారంటారని నీకెట్లా తెలుసు ?

పూలపిల్ల : పూలు కొనేదాకా అందరూ మాకు దొరలేనండి.

(అని హేళనగా నవ్వుతూ పట్టనట్టు వెళ్ళిపోయింది)

దొర : ఏమంటుంది ఆ పిల్లా ? దాని ఉద్దేశ్యం ఏమిటి ? మనం పూలు కొనే బాపతు కాదనా ? సాయంకాలం మా గుళ్ళో పూజలకు జావా నుంచి క్రోటను పూలు తెప్పిస్తాను తెలుసా ? - రోజూ ... ఓయ్ పూలమ్మాయ్ !

ఇటురా !

(పూలపిల్ల వెనక్కి తిరిగి చూసి నవ్వుతూ వెళ్ళిపోతుంది)

ఎంత పొగరు ? అది మనల్ని అట్టా ఖాతరు చెయ్యకుండా -

కనకయ్య : అయ్యా ! ఇవ్వాళ ఊళ్ళో అందరూ ఇక్కడ కూడతారు ... స్థాన బలిమి వాళ్ళది ... కాస్త మనమే తమాయించుకుంటే ...

దొర : మీద మీద కొస్తుంటే - తమాయించుకోమంటావేం ?

వీరాస్వామి : అయ్యా ! మనం వచ్చిన పని -

కనకయ్య : అదేనండయ్యా నేను అడిగేది కూడా - తమరు ఈరాసామి చేత కబురంపించినారు గందా -

(నువ్వు చెప్పు అన్నట్లు దొరగారు, బొక్కసం వీరాస్వామికి సైగ చేస్తారు)

వీరాస్వామి : నీ పంట పండిందిలే కనకయ్యగోరూ ! నీలాంటోడ్ని తనతో కలుపుకుపోవాలని అయ్యగారి ఉద్దేశం -

కనకయ్య : అంటే ?

దొర : అంటే - మేం కొత్తగా చెయ్యబోతున్న వ్యాపారంలో నీక్కూడా వాటా యివ్వాలని నా ఉద్దేశ్యం.

వీరాస్వామి : వంద కోట్ల వ్యాపారం !

కనకయ్య : వంద కోట్లా ?

(గ్యాని అప్పటికే అందరి దగ్గరికీ వెళ్ళి అప్పుడు దొర దగ్గరకు వచ్చాడు)

గ్యాని : నాక్కూడా ఓ కోటు యివ్వండయ్యా - చలికాలం ఒణికిపోతున్నా !

వీరాస్వామి : (నవ్వి) ఇది కప్పుకునే కోటు కాదు ముసలయ్యా ! గల్లా పెట్టెలు నింపే కోట్లులే !

తిరపతమ్మ : ఒరే టింగరీ ! టీ తీసుకుపోయి అమ్ముకురారా !

టింగరి : రైటో రట్ ... (నాలుగు టీ గ్లాసులు ఒక కెటిల్ లో టీ తీసుకుని) టీ

అండీ ! గరం గరం టీ ... నీకూ నీ వారు లేరు - నాకూ నా వారు లేరు ... టీ అండీ టీ !

తిరపతమ్మ : ఎదవ సచ్చినోడా ! అవేం పాటల్రా ? సరిగ్గా అమ్మి యేడు.

టింగరి : టీ అండీ టీ ... 'గాని' తాతా ! అక్కడ కూచో - ఇదుగో టీ తీసుకో –

(తీసుకువెళ్ళి ఓ పక్కన కూచోబెట్టి టీ కప్పు యిస్తాడు)

గ్యాని : మా నాయనే ! నీ కడుపు చల్లగా ...

టింగరి : తిరపతమ్మ కడుపు చల్లగా - అను ... టీ దొరగారూ ! టీ ! ఒంటో యేడి తగ్గాలంటే మా తిరపతమ్మ టీ నే తాగాలండీ –

(దొరను అడుగుతాడు)

దొర : (అవతలి వైపుకు వెడుతూ) రాస్కెల్ ... ఆ మురికి చేతులు ... ఆ బట్టలు !

కనకయ్య : అయ్యా ! వాళ్ళను వదిలెయ్యండి ... కాసేపు చూసి వాళ్ళే మానేస్తారు ... మన సంగతికొద్దాం -

వీరాస్వామి : అయ్యగారు మొదలు పెట్టబోయే యాపారంలో నీకో పది పైసలు వాటా యివ్వాలని అయ్యగారనుకొంటున్నారు !

కనకయ్య : అయ్యో సామీ ! పెట్టుబడి పెట్టడానికి నా దగ్గర ఒక్క పైసా లేదండీ !

దొర : కనకయ్యా ! నా వ్యాపారంలో నీకు పది పైసలు వాటా యివ్వడం నువ్వు పెట్టుబడి పెట్టాలని కాదోయ్ !

వీరాస్వామి : పెట్టుబడి పైసా లేదు ... అంతా అయ్యగారే చూసుకుంటారు !

కనకయ్య : పెట్టుబడి పైసా లేదు ... యాపారంలో వాటా ! ఇన్నేళ్ళుగా ధాన్యం యాపారం

జేస్తున్నా ! ఎక్కడా ఇనలేదండీ ఇటువంటి మాట !

దొర : మరేమనుకుంటున్నావ్ ! పెట్టుబడి లేదు ... వ్యాపారంలో నీ వాటా కింద మొదటి సంవత్సరం నికర లాభం లక్ష - ఆ వాటా మళ్ళీ కంపెనీలో పెట్టు - రెండో సంవత్సరానికి అయిదు లక్షలు ... మూడో ఏటికి పది లక్షలు - నాలుగో ఏటికి 20 లక్షలు ... ఆరేళ్ళయ్యేసరికి కోటి ... కోటి రూపాయలకి నువ్వు ఆసామీవన్నమాట !

(ఇది చెబుతున్నంతసేపూ కామందు కనకయ్య నోరు తెరుచుకొని దొర చేతుల వంక చూస్తూనే వున్నాడు ... మూగవాడు మూడు బంతుల్ని పైకి ఎగర వేస్తూ వుంటాడు ... ప్రతి లక్షకీ బంతి యింకా యింకా పైకి పోతుంది ... కోటి అనేసరికి బంతి పైకి పోయింది కాని కింద పడదు ... మూగవాడు బంతి వస్తుందేమోనని చూస్తూనే వుంటాడు)

కనకయ్య : పెట్టుబడి లేకుండా - ఆరేళ్ళలో కోటి రూపాయలా ? దొరవారూ ! మీ మేలు -

దొర : మరిచిపోకుండా వున్నావన్నడానికి ఒక చిన్న పరీక్ష !

కనకయ్య : చెప్పండి ... ఏమయినా చేసేస్తా -

దొర : ఏమీ లేదు ... ఈ వూళ్ళో నేనొక వెయ్యి ఎకరాల పొలం కొందామనుకుంటున్నాను.

కనకయ్య : వెయ్యి ఎకరాలే !

దొర : ఆఁ ! మార్కెట్ ధర కన్న నాలుగు వేలు ఎక్కువే యిద్దాం ... నీక్కావాలంటే ఇప్పుడే బయానా కూడా -

కనకయ్య : అయ్యా ! అయ్యా ! కొంచెం అర్థమయ్యేటట్టు చెప్పండయ్యా !

వీరాస్వామి : మీ ఊళ్ళో అయ్యగారు వెయ్యి ఎకరాలు పొలం కొందామను కుంటున్నాడు ... అది నీ ద్వారా జరగాలి ... అందులో నీకు సూటికి అయిదు శాతం కమీషను -

కనకయ్య : వెయ్యి ఎకరాలు ఎందుకని మావూరి వాళ్ళు అడిగితే ?

దొర : ఎకరాలు ఎందుకు మాకు ? పంటలు, తోటలు వెయ్యడానికి ఇంకా

మిగిలితే ఏదన్నా ఫ్యాక్టరీ పెట్టడానికి నేను ప్రారంభించే కొత్త వ్యాపారం యిక్కడే ప్రారంభించవచ్చు.

కనకయ్య : ఏం వ్యాపారం ? మిగిలిన వాటాదారులు ?

దొర : కనకయ్యగారూ ! ముందు దొరగారి మనసుకు వచ్చిన మడుసులు దొరికితే, ఆళ్ళే వాటాదారులు ! వాళ్ళు దొరికినాకే ఏం వ్యాపారం పెట్టడమే ఆలోచిస్తారు !

కనకయ్య : దొరగోరూ ! నాకు తెలిక అడుగుతాను ... తప్పయితే మన్నించాలి ... మీరు పూర్వీకులు కాలం నుంచీ ధనవంతులా ? లేక -

దొర : కనకయ్యా ! ... నేనూ మొదట నీలాంటి మామూలు మనిషినే ! నేను మొట్ట మొదట డబ్బు సంపాదించినప్పుడు అది వ్యాపారం అనుకోలేదు !

కనకయ్య : ఆఁ !

దొర : అప్పుడు నాకు పదేళ్ళు ... ఒరేయ్ కుర్రాడా ! ఈ పెట్టె తీసుకెళ్ళి ఆ కార్లో కూచున్న వాళ్ళకిస్తే నీకు వంద రూపాయలిస్తానన్నాడు ఓ పెద్దమనిషి ... ఆయన వంక చూశా ... ఆ కళ్ళు వెలిగిపోతున్నాయి ... మతాబుల్లా ఉన్నాయి ... వెనకా ముందు చూడలా - వంద రూపాయలు ! నా మొదటి సంపాదన ! నేను

తీసుకొచ్చిన పెట్టెలో నకిలీ నోట్లున్నాయట ! ... ఇహ వెనుక, ముందు చూడలా ... కొన్నాళ్ళు అదే వ్యాపారం ... లో ఉన్నా ... దాని అనుపానులు కనుక్కున్నా ! నా ఇరవయ్యో ఏట స్వతంత్రంగా వ్యాపారం మొదలెట్టా! ఆ తరువాత కంపెనీలు పెట్టా ... వాటాలు కొన్నా -

వీరాస్వామి : ఇవ్వాళ దేశంలోనే మహా ధనవంతుల్లో ఒకరు అనిపించుకున్నారు ... 14 రకాల వ్యాపారాలు ! ... ఇప్పుడు పెడుదామనుకొంటున్నది పదిహేనో యాపారం !

కనకయ్య : ఇన్ని వ్యాపారాలు ! మీరొక్కరే !

వీరాస్వామి : నీ పంట పండిందిలే కనకయ్యగారూ ! ఇప్పుడు నువ్వు కూడా అయ్యగారి లాగా (పైపైకి పోవాలని సూచిస్తాడు) అట్లా ఎదగాలి !

కనకయ్య : మరి మిగిలిన వాటాదార్లు ఎక్కడ ?

వీరాస్వామి : వస్తారు ... వస్తారు ...

దొర : వాటాదార్లను ఎన్నుకొనేటప్పుడు తొందరపడకూడదు ... మనుషుల్ని జాగ్రత్తగా పరిశీలించు ... వాళ్ళ కళ్ళల్లోకి చూడు ... ఆ కళ్ళల్లో ఆశలు మతాబులు వెలుగుతూ కనిపిస్తే, అతనే మన మనిషి ...

(పిట్టలదొర ... తుపాకీ రాముడు - ప్రవేశిస్తారు ... కొయ్య తుపాకీ ... నెత్తి మీద హాట్ ... కోటు -)

రాముడు : ఆం ... భ్యాం ... భట్ ... నేనిప్పుడు ఉజ్జయినీ నగరం నుంచి వస్తున్నా ... అక్కడ రాజుగారింటో పెళ్ళికి నన్ను వంట చెయ్యమని బతిమిలాడారు ... ఒకళ్ళా యిద్దరా ? ఇరవై వేలమంది చుట్టాలు పక్కాలు - నాలుగొందల మందిని తీసుకుపోయా - కూరలు చేసేవాడు వేరు - పులుసు చేసేవాడు వేరు - పచ్చళ్ళు చేసేవారు వేరు - పోపు మాత్రం అన్నింట్లో నేనే పెడతా - ఆం ... భ్యాం ... భట్ ... పోపుదేంతో పెట్టానంటారా ? ... ఆముదంలో జిల్లేడు పప్పులు వేయిస్తా ... అందులో మిరపగింజలు తాళిస్తా ... దాంతో పోపు వేస్తే ఆవురావురుమని తినేసి తేర్చారు ... తేర్చడమంటే - నిద్రపోదామని పడుకోవడమేమిటి ? అంతే ? ఆ పెళ్ళికి 60 గుండిగలతో అన్నం వండా ... వంద గుండిగల సీమ తుమ్మకాయలతో పప్పు ... రెండొందల గుండిగల కుంకుడు కాయ పులుసు చేసి ధప్పళం బెట్టేసరికి రాజుగారి పెళ్ళాం మెళ్ళో కాసుల పేర్లన్నీ నా కిచ్చేసి యిక్కడే వుండిపో అంది ... మా వూరు సంబరాలకి పోవాలి ... అయినాంక వస్తాన్లే అని చక్కా వచ్చా (అందరూ నవ్వుతారు)

బసవయ్య : సీతారాముడూ ! నువ్వులేవు - సరదాలేదు -

(అందరూ నవ్వడం చూసి దొర కోపంతో మండిపడుతూ అటూ ఇటూ తిరుగుతున్నాడు ...)

దొర : బుద్ధిలేని మనుషులు - నేరక వచ్చాను ... వీరాస్వామీ ! నువ్వన్నా చెప్పొద్దూ - (రుసరుసలాడతాడు)

(అవతలి పక్క నుంచి ఒక ముక్కు మనిషి పొడుగు మనిషి చేతులో ఒక సీసాతో ప్రవేశం ... మధ్య మధ్యలో అందులో పానీయాన్ని తాగుతున్నాడు ... వాసన చూస్తున్నాడు ... ఆస్వాదిస్తున్నాడు... తనలోతానే నవ్వుకుంటున్నాడు ... చేతిలో వున్న సీసాలో ద్రావకం అయిపోయింది ... చివరిబొట్టు కూడా రుచి చూశాడు ... వెళ్ళి తిరపతమ్మ టీకొట్టు దగ్గర ఉన్న స్టూలు మీద కూర్చుని టింగరిని మంచినీళ్ళివ్వమంటాడు ... మళ్ళీ వాసన చూశాడు ... రుచి చూశాడు

... ఆస్వాదించాడు ... దొర నిశితంగా చూస్తున్నాడు ఆయన వంకే ! మిగిలిన వాళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు)

ముక్కుమనిషి : ఓ టీ తీసుకురారా కుర్రాడా !

(టింగరి భయపడుతూ టీ ఇచ్చాడు ... దాన్ని కూడా అట్లాగే ఆస్వాదిస్తూ వుంటాడు)

బసవయ్య : ఎవరీయన సీతారాముడూ ? ఎక్కడా చూళ్ళేదే ?

రాముడు : మనూరికి కొత్త అల్లే వుందిలే !

బసవయ్య : ఏందో - ఇయ్యాలంతా కొత్త కొత్త మనుషులొస్తున్నారు ; కొత్త కొత్తగా పనులు చేస్తున్నారు -

రాముడు : సంబరాలు గదా బసవయ్యా ! ... ఇంకేం తమాషాలు జరుగుతాయో చూద్దాం !

బసవయ్య : ఏందో ... అంతా అయోమయంగా ఉంది ...

ముక్కుమనిషి : (తాను తాగిన గ్లాసును మరోసారి ఆఘ్రాణించి) ఆహా ! ఇదుగో, టీకొట్టు అమ్మీ ! డబ్బులు తీసుకో ! (వంద రూపాయల నోటు యిస్తాడు)

తిరపతమ్మ : చిల్లర లేదయ్యా ! ... ఆనక యివ్వండి ... మూడు రూపాయలు !

ముక్కుమనిషి : లేదు లేదు ... అంతా వుంచేసుకో ... నువ్వు చూపించిన టీ వాసన ఖరీదు వంద రూపాయలు !

వీరాస్వామి : (దొరగారితో) ఎవడో పిచ్చోడండి ... టీ - టీ వాసనొస్తుంది గానీ ... దానికి వందరూపాయలంటే - నిజంగా పిచ్చోడే !

దొర : ష్ ! మాట్లాడకు ... గొప్పవాళ్ళందరూ ఇట్లా పిచ్చి వాళ్ళలానే కనిపిస్తారు.

కనకయ్య : ఈయన గొప్పోడా ? ... ఏంటి దొరగారూ మీరనేది ?

దొర : జాగ్రత్తగా చూడండి ... ఆయన కళ్ళల్లో కనిపించే కాంతి ! మతాబుల వెలుగు ... ఆశల జ్వాలలు !

ముక్కుమనిషి : (అందరి వంకా తిరిగి) మీకు తెలియదు ... ఇహ రాను రాను మీ ఊరికి దశ తిరగబోతోంది ... పదేళ్ళలో యిక్కడి టీ ధర వంద రూపాయలు పలుకుతుంది ... నా మాట వేదవాక్యం !

రాముడు : మీనోటి చలవ ... అట్టాగావాలే గాని మా తిరపతమ్మక్క లచ్చాధికారేనన్నమాట !

(అందరూ వెళ్ళి తిరపతమ్మను ఎత్తుకొని ఆలంగం తిప్పుతారు)

దొర : ఆహా ! ఏం ముందు చూపు !

కనకయ్య : ఓస్ ! జాతకాలు చెప్పే ఆయనా ఈయన ?

దొర : ఆయన చెప్పే జాతకం మామూలు జాతకం కాదు ... ఇవ్వాళ్టికి రేపటి జాతకం చెబుతున్నాడు ...

ముక్కుమనిషి : (దొరగారిని చూసి తనలో) మిగిలిన వాళ్ళంతా సాదా సీదా జనం ... ఈయన ఒక్కడే వేరుగా ఉన్నాడు ... ఏం ఠీవి ! ఏం ఖరీదయిన మనిషి ! ... ఆఁ ! నాక్కావలసిన మనిషి ఈయనే !

దొర : (కామందుతో) ఇటువంటి వాడి కోసమే వెదుకుతున్నాను !

(దొర, ముక్కు మనిషి ముందు ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకుంటారు ... ఆ తరువాత అర్థం చేసుకున్నట్టు మందహాసం ... ఇది వరకే తెలిసి వున్నట్టు ముఖాల మీద నవ్వు ... ఆప్యాయత ... వాళ్ళు వలయాకారంగా తిరుగుతూ ఒకరికి ఒకరు చిరకాల స్నేహితుల్లా ప్రవర్తిస్తారు ... మిగిలినవాళ్ళు నిశ్చేష్టులయినారు ... వారిద్దరి మధ్య పరస్పరం పొగడ్తల దండకం)

## ॥ ద్వి - దండకం ॥

## ॥ సంవాదధృవ ॥

ముక్కుమనిషి : జయజయ మహారాజరాజ !

దొర : నమోదివ్యరూప ...

ముక్కుమనిషి : నీ రూపంబు నే జూచి ధన్యుండనైతిన్ - మహా నాయకమ్మన్య - నీ సాటి లేరెవ్వరీ జగతి ...

దొర : నిన్ను గుర్తించితిన్ - ని ముక్కు పొంకంబు నే జూచితిన్ - నీ వాసన ఖ్యాతి దేశమ్ము నందంత ప్రఖ్యాతమై ఎంతో సంతోషమున్ గూర్చదే !

ముక్కుమనిషి : నీ కండ బలమందరకు తేటతెల్లంబు గాదా ! నీ అండ మాకుండ మాకసాధ్యంబేది ?

దొర : నీ తెలివికెదురేది ? నీ బుద్ధి, పగవారి గెలిచేటి నీ చాకచక్యం బమోఘమ్ముకాదే?

ముక్కుమనిషి : నీ బలము, నీ ధనము, రాజకీయాలలో నీకున్న ప్రఖ్యాతి నాకండగా నిలిచి నా ఈత్సితమ్మీడేరితే -

దొర : నీ తెలివి, నీ కలిమి నా వెంటనే వుండి నా కలలు నిజములైతే -

ఇద్దరూ : మనమివ్వురం గలిసి, ఒకచోట కొలువుండి, ఆర్డర్లు పాస్జేసి కార్యంబు సాఫల్యంబుగా జేయ సమకట్ట మనకింక అడ్డేది ?

ముక్కుమనిషి : నమో దివ్యతేజా !

దొర : నమో సత్యభాషా ?

ముక్కుమనిషి : నమో నిత్యపన్నాగ శౌరీ !

ఇద్దరూ : (ఒకరికొకరు) నమస్తే నమస్తే నమస్తే నమః

(ఇద్దరూ క్రమక్రమంగా దగ్గరకు వచ్చి ఒకరినొకరు కౌగలించుకుంటారు)

(గ్యాని ఏదో పాడుకుంటూనే వున్నాడు లోలోపల ... దొర, ముక్కు మనిషి కావిలించుకొనే సమయానికే "శ్రీమద్రమారమణ గోవిందో హరి" అంటాడు ... అందరూ నవుతారు)

పూలపిల్ల : (తిరపతమ్మ తో) పిన్నీ ! చారలపులి పెద్దపులిని నమ్ముతుంది గాని కుందేలును నమ్మదుగా !

తిరపతమ్మ : మా బాగా చెప్పావే అమ్మడూ ! పొంచి వుండే దయ్యం పోయిన చీటికల్లా వస్తుందంటారు ! మన ఊరు బతుకు అట్టావుంది !

రాముడు : మన ఊరు బతుక్కేం తిరపతక్కా ! ... గ్యాని మామ చెప్పినట్టు - "శ్రీమద్రమారమణ గోవిందో హరి"

(మళ్ళీ అందరూ నవ్వుతారు)

దొర : (దురుసుగా మరో పక్కకు పోతూ) ఈ పాటలు ... వెక్కిరింతలూ ... వేళాకోళాలు తప్ప వీళ్ళకేం తెలిసినట్టు లేదు ... వెధవలు ... వెధవలని !

ముక్కుమనిషి : (మళ్ళీ రహస్యంగా) ఊరుకోండి ... వాళ్ళతో మనకి అత్యవసర కార్యం ఒకటుంది !

దొర : ఏమిటి ? భూములు కొనడమేనా ?

ముక్కుమనిషి : అంతకన్న ముఖ్యమైన అవసరం ఉన్నదండీ !

దొర : ఉంటే ఇక్కడి వూరు సర్పంచ్ కామందు కనకయ్య చేసి పెడతాడు - మనవాడే!

ముక్కుమనిషి : ఆ పని కనకయ్య చేసే పని కాదండీ ...

(పూలపిల్ల పూలు అమ్ముతూ వస్తుంది ... ముక్కు మనిషి ఆమెను తినేసేటట్టు చూస్తూ ఉంటాడు ... బసవయ్య, టింగరి, తుపాకి రాముడు ఆయనని ఉరుముతూ చూస్తారు)

కనకయ్య : (ముక్కు మనిషిని పక్కకు లాగి) ఊరుకోవయ్యా ! ... మీరు ఈ ఊరికి కొత్త ... ఆ అమ్మాయిని ఎవరన్నా ఏమన్నా అంటే ఊరు ఊరంతా కత్తులు పుచ్చుకొని వస్తారు ...

పూలపిల్ల : ఏం కామందుగోరూ ! గుసగుసలాడు కుంటున్నారు ? నన్ను గురించేనా?

కనకయ్య : ఏందమ్మోయ్ ! నిన్ను గురించి మాట్లాడు కోవడానికి మాకేం పని ?

పూలపిల్ల : మరి ఎవర్ని గురించో పని ? ... (నవ్వి) ఏం దొరగారూ ! పూలు తీసుకోరా? ... ("నువ్వేం తీసుకుంటావులే" అన్నట్టు నవ్వుతూ)

మల్లెపూలు, సన్నజాజులు, గులాబీలు ...

దొర : (పూలపిల్ల దగ్గరకు పోయి) ఏమిటి నీ ఉద్దేశ్యం ? అట్లా నవ్వుతూ వెళ్ళిపోతావ్ ? ఎగతాళా ... ?

వీరాస్వామి : దొరగారంటే పెద్ద పెద్దోళ్లకే భయం ... ఆయనతో ఇట్టాగేనా మాట్లాడదం?

కనకయ్య : మనకెందుకు ఊరు కోవయ్యా !

బసవయ్య : ఏమండోయ్ కామందూ ! మీ పనేదో మీరు చూసుకుని చక్కాపోండి ... అంతేగాని మా జోలికి రాకండి -

కనకయ్య : అయ్యా ! మా తోట బంగళాకి పోదాం పదండి ...

ముక్కుమనిషి : ఆగవయ్యా ! ముందు మీకో అద్భుతమైన విషయం చూపించాలి ఇక్కడ ... మరిచిపోలేని విషయం ...

(దొర, కామందు కనకయ్య, బిక్కసం వీరాస్వామి ఒకేసారి)

ముగ్గురూ : ఏమిటిది ?

ముక్కుమనిషి : చెబుతున్నా ... చెబుతున్నా ... (దొరగారితో) మీరిక్కడి నీళ్ళు తాగారా ?

దొర : (ఛీత్కారంతో) ఛీ ! ఇక్కడి మురికి నీళ్ళా ?

ముక్కుమనిషి : అమ్మో ! మురికి అని కొట్టిపారెయ్యకండి ... పోనీ ఇక్కడి టీ తాగారా ?

దొర : ఛీ, ఛీ, ఛీ ! ఆ మకిలిని గ్లాసులు ... ఆ వెకిలి మనుషులూ !

ముక్కుమనిషి : అయ్యా ! మకిలిని తోమితేనే బంగారం !

| | |
|---|---|
| దొర : | అసలు విషయం చెప్పవయ్యా ! |
| ముక్కుమనిషి : | ముందు మీరు యిక్కడి టీ తాగండి ... ఆ తరవాత అసలు విషయం చెబుతాను ... (బొక్కసం వీరాస్వామితో) నాలుగు టీ తెమ్మని చెప్పవోయ్ ! |
| | (బొక్కసం వీరాస్వామి వెడతాడు) |
| దొర : | ఏమిటి సంగతి ? |
| ముక్కుమనిషి : | అయ్యా ! ఆంధ్రదేశంలో నేను తిరగని ఊరు లేదు ... రుచి చూడని నీళ్ళు లేవు ... భూగర్భంలో దాగివున్న వనరుల్ని గుర్తు పట్టడంలో ఈ దేశంలోనే నాకు పేరుంది ... ఇక్కడి భూమి లోపల నీళ్ళలో - |
| | (టింగరి టీ తీసుకు వస్తాడు - ముక్కు మనిషి మాట్లాడడం మానేస్తాడు) |
| కనకయ్య : | ఏముంది ? |
| ముక్కుమనిషి : | ముందు తాగండి ! |
| టింగరి : | పెసల్ పెసల్ టీ అండీ ! గొప్పోళ్ళకు గొప్ప టీ - గరం అయ్యేవోళ్ళకు గరం గరం టీ - |
| | (దొర తాగనా, వద్దా అన్నట్లు తాగుతాడు ... ముక్కు మనిషి ఆఘ్రాటిస్తూ, ఒక గుటక వేసి) |
| ముక్కుమనిషి : | ఎట్లా వుంది ? |
| దొర : | ఏదో వాసన వేస్తోంది ! |
| ముక్కుమనిషి : | (నవ్వి) మీకు - అంటే అలవాటు లేని నాలికలకు, ముక్కులకి "ఇది ఏదో వాసన" ... కాని పాతిక సంవత్సరాలుగా ఘ్రాణేంద్రియమే ప్రధానంగా వ్యాపారం చేస్తున్న నాకు తెలుసు అదేం వాసనో ! |
| వీరాస్వామి : | అయ్యా ! మీరు ఊరికే ఊరిస్తున్నారు ... ఇక్కడి ఈ నీళ్ళలో ఏం ఉన్నదంటారు? |
| ముక్కుమనిషి : | (రహస్యంగా) ఏమున్నదంటారేమిటండీ ? ఈ నీళ్ళు, ఈ టీ మీకు పెట్రోలు వాసన వెయ్యడం లేదూ ? |
| వీరాస్వామి : | ఆఁ ! నాకు ఆ వాసనే వేసింది ! |
| కనకయ్య : | అవునండోయ్ ... మీరంటుంటే నాకూ అనిపిస్తోంది ! |
| ముక్కుమనిషి : | నాకు అనుమానం లేదు ... ఈ నేల కింద - మనం నిలబడ్డ ఈ స్థలంలోనే పెట్రోలుందని నేను ఖచ్చితంగా చెప్పగలను ! |
| దొర : | ఇక్కడి నీళ్ళు పెట్రోలు వాసన వేస్తున్నాయ్ కనక ఈ భూమి కింద పెట్రోలు బావులున్నాయంటే నమ్మడం ఎలా ? |
| ముక్కుమనిషి : | దొరగారూ ! నన్ను అనుమానించండి ... నా తెలివి తేటల్ని అనుమానించండి ... కాని నా ముక్కుపుటాల్ని, నా నాలిక కొనల్ని మాత్రం అమ్మనుమానించకండి ... ఏటువంటి వస్తువు రుచి, వాసనా అయినా తెలుసుకోవడంలో ఆరితేరిన ఇంద్రియాలు ఇవి ... నాకు (టింగరి అటు వెడతాడు ... ముక్కు మనిషి మాట్లాడడం ఆపు చేస్తాడు ... వాడు వెళ్ళాక) ఏ మాత్రం అనుమానం లేదు ... ఇక్కడ పెట్రోలు నిక్షేపాలు ఉండక తప్పదు ! |
| దొర : | బిగ్గరగా అనకయ్యా ... చుట్టూ మనుషుల్ని పెట్టుకొని అంత పెద్దగా మాట్లాడతావేం ? |

(టింగరి టీ అమ్ముతూ మళ్ళీ అటు వస్తాడు)

వీరాస్వామి : ఒరేయ్ టింగరీ ! నీకు వేరే పనేం లేదాయేం ? మా చుట్టూనే తిరుగుతావేం ? ఇక్కడేం కోతులాడుతున్నాయా ?

టింగరి : (నవ్వుతూ, నలుగురి వంకా చూసి) భలే కనిపెట్టేశారే !

(దొర కోపంతో ఊగిపోతూ వాడిని కొట్టడానికి వెళ్ళాడు ... వాడు పారిపోతాడు)

దొర : ఇహ ఇక్కడ ఒక్క క్షణం ఉండొద్దు ... వీళ్ళకి చిన్నా, పెద్దా అంతరం తెలియదు ... మర్యాద, మన్నన అసలు తెలియదు ... ఒట్టి మూర్ఖపు గాడిదలు !

బసవయ్య : ఏమండోయ్ పెద్ద దొరలూ ! ఊరికే మాటలు తూలకండి ... బావుండదు !

వీరాస్వామి : ఏమిటయ్యా నీ దౌర్జన్యం ? ఆయనెవరో తెలుసుకోకుండా మాట్లాడకు !

రాముడు : తెలియకేంలెండి ... ఎంత గొప్పోరయినా ఇట్టా ఊరికే మాటలంటుంటే ఊరుకునేది లేదు తెలుసా ?

వీరాస్వామి : ఏం చేస్తావోయ్ ... ఏం చేస్తావ్ ?

రాముడు : ఏమైనా చేస్తాం ... గౌరవం యిచ్చి పుచ్చుకోమన్నారు !

కనకయ్య : అయ్యా ! ఎందుకీ రభస ? ... మనం మరో చోటికి పోదాం పదండి !

దొర : ఏమిటయ్యా పోయేది ? ఇది వాళ్ళ స్వంతమా ? చూపిస్తాను నా తడాఖా ఏమిటో !

బసవయ్య : ఏమిటయ్యా ? ఏదీ చూపించు ... తడాఖా చూపిస్తాట్ట !

(అందరినీ పక్కకు తీసుకుపోతాడు కనకయ్య ... వాళ్ళ గుసగుసలు)

దొర : పదేళ్ళలో ఈ ఊర్లో బంగారం పండిస్తామంటుంటే వీళ్ళు గుర్రెక్కుతున్నారేమిటీ ?

ముక్కుమనిషి : అఙ్ఞానం - అఙ్ఞానమండీ -

దొర : ఙ్ఞానం కాదు - అలగాజనం !

కనకయ్య : (వారిస్తూ) అయ్యా !

ముక్కుమనిషి : ఇక్కడకు వచ్చే ముందే ఒక బ్రహ్మాండమైన ప్లాను వేశాను ... ఈ పక్క వూర్లో ఉన్న మా వాడినొకడిని ఈ భూముల అధికారిని ఎంతైనా ముట్ట చెప్పి ఈ చుట్టు పక్కల వున్న దేవుడి మాన్యాన్ని నా పేర రాయించే ఏర్పాటు చేయమన్నాను ... వాడు - ఆ ఆఫీసరు - మొండి ఘటంట ! - వాడు ఒప్పుకోకపోతే వాడిని వాడి ఆఫీసును లేపేయన్నాను ...

కనకయ్య : దేవుడి గుడిని ముట్టుకుంటే మాత్రం ఊళ్ళో వాళ్ళు ఊరుకోరండి !

దొర : కనకయ్యా ! నువ్వు గూడా అట్లా అంటే ఎట్లా ? వెయ్యి పెట్టే చోట పదివేలు పెట్టు ... లక్ష పెట్టు ... మిగిలిన వాళ్ళకి తెలిసేలోగా ఈ పని చక్క పెట్టు ...

(ఒక పక్క వీళ్ళ మంతనాలు ... రెండో పక్క జనం)

II తత్త్వం II

II అనుబంధధృవ II

గ్యాని : నందామయా గురుడనందామయా

ఆనందదేవికీ నందామయా
అఁధాన నవ్వుంది తలపుల్లో విషముంది
ఏమందురా రామ ఏమందును ?
కడుపు కక్కుర్తికై కపటవేషమువేతు
రేమందురా రామ ఏమందును ?
ఉన్నదంతా మాది వచ్చేది మాదందు
రేమందురా రామ ఏమందును ?
గుడికి మింగిన వారె లింగమేదనియెరు
ఏమందురా రామ ఏమందును ?

కనకయ్య : వాళ్ళకు తెలిసిపోయినట్టుందండీ ! గుడి ... 'మింగడం' – అంటున్నారు?

వీరాస్వామి : నీదంతా చోద్యం కనకయ్యగారూ ! ఏదో తత్త్వం పాడుకుంటూవుంటే నీ ఉలికి పాటేంది ?

(టింగరి వస్తాడు వాళ్ళ దగ్గరికి ఈసారి ... వేరుశనక్కాయలు అమ్ముతూ)

టింగరి : శనక్కాయలు ... శనక్కాయలు ... కరకరలాడే శనక్కాయలు ... కాలక్షేపం శనక్కాయలు ...

దొర : ఇదంతా ఏదో గూడు పుఠాణీలా వుంది ... ప్రతిసారి వీడిని మన మీదకు తోలతారేమిటీ ?

టింగరి : శనక్కాయలు ... శనక్కాయలు ...

పూలపిల్ల : మల్లెపూలు, సన్నజాజులు, గులాబీలు ...

దొర : ఛీ ! ఛీ ! పాడు సంత ! ఒక్క క్షణం మాట్లాడుకోనివ్వడం లేదు ... ఇహ పోదాం పదండి ...

ముక్కుమనిషి : అయ్యా ! కాసేపు ఆగండి ! ... మా వాడిని పనిపూర్తి చేసుకుని నేరుగా ఇక్కడికే రమ్మన్నాను ... అందుకని వాడొచ్చేదాకా మనం ఉండి తీరాలి ...

(అవతలి పక్క జనం గుసగుసలు)

తిరపతమ్మ : ఏంది బసవయ్యా ! ఎప్పుడూ చూడలేదు ఈ చోద్యం ! చూడబోతే పెద్ద పెద్ద కామందులు -

బసవయ్య : కామందులు కాదు ... రాబందులు -

గ్యాని : ఆళ్ళ గొడవల్లో పడి మన పనులు మానకండ్రా -

బసవయ్య : ఏం చెయ్యమంటావు తాతా ! ఈళ్ళని చూస్తే ... ఈళ్ళ గుసగుసలు చూస్తే మన వూరికేదో ముసలం వచ్చేటట్టు వుంది !

తిరపతమ్మ : పిల్లల్ని పట్టుకుని ఇంతంత మాటలంటున్నారు !

రాముడు : ఇక్కడందర్నీ పట్టుకుని "మూర్ఖపు గాడిదలు" అన్నాడు ! వీళ్ళ కంటికి మనం మూర్ఖులం ! గాడిదలం ! అంతేనా ?

గ్యాని : మీరు కూడా తొందరపడితే ఎట్లా ? ... బసవయ్యా ! ఒక పాట ఎత్తుకో !

తిరపతమ్మ : పాడు బసవయ్యా ! గొప్పోళ్ళ గోత్రాలు తెలిసిరావాల !

రాముడు : ఎవరు గాడిదలో తెలియజెప్పాల !

(బసవయ్య రాగం అందుకుంటాడు ... అందరూ అతని చుట్టూ చేరతారు)

॥ బసవయ్య చెప్పిన గాడిద కథ ॥

॥ ఉద్ధతధృవ ॥

బసవయ్య : కథ చెబుతా వింటారా ! ఓ అన్నల్లారా ! అక్కల్లారా

కలకాలం జ్ఞాపకముండేది ... కలికాలం సంగతి చెప్పేది ॥

అనగనగా ఒక ఊరు

ఆ వూళ్ళో ఒక గార్దభరాజు

జనం : గార్దభరాజా ?

బసవయ్య : అవును ...

కొమ్ములయితే లేవుగాని

కుమ్మేస్తానంటాడు !

మెదడెట్లాగూ లేదు కనక

కాళ్ళకు పని చెబుతాడు ॥

రాముడు : అంటే మెదడు కాళ్ళలో ఉందన్నమాట !

బసవయ్య : ఓ మడేలు దగ్గర ఉంటూ - మరొకడికి ఊడిగమేమిటి అంటూ -

మడేలు జనాన్ని తంతూ - అతలాకుతలం చేసేశాడు ॥ గాడిదరాజు ॥

**ఇరుగుపొరుగు సహించడు - చిన్నా పెద్దా చూడడు**

**తనముందూ వెనకా ఎవరు నిలిచినా**

**గుడ్డి తన్నులూ తంతాడు -** **॥ గాడిదరాజు ॥**

**దుష్టుడు వీడు దూరం అంటూ**

**తొలిగి తొలిగి పోయారూ**

**జనమంతా**

**నలిగినలిగి పోయారు** **॥ కథ ॥**

**తన దగ్గరి కెవరూ రారని**

**తనసీడను చూసే భయపడిపోతున్నారని**

**ఝడిపించే వాడుంటే సామాన్యుడు వణికేనని**

**ఝడిపిస్తూ బతకడమే ఈలోకం న్యాయమని**

**గార్దభరాజు తెలుసుకుని**

**గర్వంతో గాండ్రించాడు గాడిద తన్నులు తన్నాడు ॥**

**ఎక్కడ నిలవాలన్నా గార్దభరాజున్నాడని గుబగుబ**

**బిక్కుబిక్కుగా బతికేరు బిరాన పరుగులు తీసేరు ॥**

**పరుగులెత్తిన బడుగుజీవులు**

వెనుదిరిగొకపరి చూశారు
ఒక్కరొక్కరుగ కూడారు
"నోరు లెత్తి మాటాడి ఎరుగము
కళ్ళు తెరచి కాట్లాడి ఎరుగము
మనమేం అనకుండానే మన మీదికి
మరీ మరీ వస్తున్నాడెందుకు ?
ఎందుకు ? ఎందుకు ? ఎందుకు ?
నువ్వూ నేనూ వాడూ వీడూ
నలుగురమూ కలిసి నిలిస్తే
ఏం చేస్తాడీ గాడిద ?
ఏం చేస్తాడేం చేస్తాడేం చేస్తాడు ?
ఒక్కరొక్కరూ కలిసి ఇద్దరు ముగ్గురు నలుగురై
పదిమందీ పది దిక్కుల నుండి వందలు వేలుగ కలిసి నిలిస్తే
ఎట్లా వస్తాడో చూద్దాము - ఈ గార్దభరాజు
ఎట్లా తంతాడో చూద్దాము ॥

గ్యాని : అస్తు ... అస్తు ... అస్తు ...

దొర : ఏమిటి గాడిద కథ ? అర్థం పర్థం లేని సొద !

బసవయ్య : ఇది అర్థం లేనిది కాదు - ఇది సామన్య శాస్త్రం
ఇది సామాన్యుడి శాస్త్రం - సామాన్యుడి శస్త్రం
అందులో మొదటి పాఠం యిది
వ్యష్టికేక వచనమెపుడూ నష్టి, నష్టి బహువచనం పుష్టి
సమిష్టి అంటేనే పుష్టి -
(అందరూ చప్పట్లు చరుస్తూ కేరింతలు కొడతారు ... పెద్దలు థాం ధూం లాడుతూ మరో పక్కకు పోతారు)

దొర : ఇంత అవమానమా ! మనల్ని గాడిదలు ... గుర్రాలు అంటూ అపహాస్యం చెస్తారా ? ... చుస్తాను చూస్తాను ... వీళ్ళ అంతు చూస్తాను !

ముక్కుమనిషి : అయ్యా ! ముందు నేను పంపిన కుర్రాణ్ణి రానివ్వండి ... ఆ తరవాత తెలుస్తుంది మన తడాఖా -

వీరాస్వామి : అంతదాకా కాస్త ఓపిక పట్టండయ్యా ! ... లేకపోతే మొదటికే మోసం వచ్చేటట్టుంది !

కనకయ్య : అయ్యా ! ముందు మనం ఇక్కణ్ణించి తప్పుకుందాం ... నేను ఒకళ్ళిద్దర్ని భూముల విషయం మాట్లాడ్డానికి రమ్మన్నాను ... మాతోట బంగళాకి వెడదాం ...

ముక్కుమనిషి : కాని మనం తొందరగా వచ్చేయాలి ... ఆ కుర్రాడు వచ్చేసరికి మనం యిక్కడ వుండాలి !

కనకయ్య : అట్లాగే ! మరి పదండి ...

వీరాస్వామి : కనకయ్యగోరూ ! ముందు విందు -

కనకయ్య : ఆ తరవాత పెట్రోలు పసందు ...

(జనం నవ్వుతారు ... కామందు కనకయ్య వెనక్కి వచ్చి వాళ్ళని తర్జనితో భయపెడతాడు ... వాళ్ళు కూడా భయపెట్టేసరికి పరుగెత్తుతాడు ... కాసేపు నిశ్శబ్దం)

(ఊరి వారంతా బిత్తరపోయి నిలబడ్డారు ... ఒక్కొక్కరు ఒక్కొక్క చరణంలో మాట్లాడుకుంటారు)

(ఊరి జనం మీమాంస)

II ఆందోళిక : జనమథనం II

II ఆవేగధృవ II

రాముడు : ఎక్కడివారు ?

తిరపతమ్మ : ఎందుకు వచ్చారేమిటి గుసగుసలు ?

పూలపిల్ల : డాబూ దర్పం చూస్తేనేమో పెద్దమనుషులనిపిస్తోంది

బసవయ్య : వేషం భాషా చూసినా పెద్దామనుషులేననిపిస్తోంది

తిరపతమ్మ : ఆ దొంగ చూపులూ, నంగి మాటలూ
దురుసు చేష్టలూ చూస్తే మాత్రం
దుండగులేమోననిపిస్తోంది
మన పాలిటి యములేమోననిపిస్తుంది

బసవయ్య : ఆయన ఎవరనుకున్నావ్ ?
దేశానికి వెన్నెముక -

గ్యాని : బాగా డబ్బుందా ?

బసవయ్య : అబ్బో ! పది తరాల దాకా కూర్చుని తినొచ్చు

గ్యాని : అట్లా చెప్పు మరి. ఎక్కడ డబ్బుంటే అక్కడ అధికారం !
అదేగా ఇవ్వాళ్టి తారక మంత్రం !

తిరపతమ్మ : డబ్బుంటే మాత్రం ? చిన్నా పెద్దా చూడొద్దూ ?

గ్యాని : మన పాటల బసవన్నని అన్నన్ని మాటలంటారా ?

బసవయ్య : మన ప్రాణం పూలపిల్ల - దాన్నట్లా కసిరి కసిరి కొడతారా ?

తిరపతమ్మ : వీళ్ళ జిమ్మడ ! ఆ చూపులు చూడు

పూలపిల్ల : ముక్కు మీద ఆ కోపం చూడు

బసవయ్య : ఆ గూడుపుఠాణీ చూడు

టింగరి : ఆ గుడుగుడు గుంజం చూడు !

గ్యాని : అటు వూరంతా సంబరాలు ! ఇటు పెద్దోళ్ళ మంతనాలు

తిరపతమ్మ : వీళ్ళ మాటలు చేతలు చూస్తుంటే

అయోమయంగా ఉంది

పూలపిల్ల : ఏం చెయ్యాలో తోచదు

తిరపతమ్మ : ఏది మంచో ఏది సెబరో తెలియడం లేదు

పూలపిల్ల : పిచ్చి మారాజుకు తెలిస్తే కుదురుస్తాడు వీళ్ళ తిక్క

తిరపతమ్మ : అందరి మంచీ కోరే ఆ మారాజుకు

ఈ దుష్టుల వైనం చెప్పడమెందుకు ?

గ్యాని : బాగా చెప్పావ్ !

మంచి మనసును గాయపరిస్తే మంచినీళ్ళు పుట్టవు

బసవయ్య : రేప్పొద్దున మనం చెప్పకుండానే ఆయనకి తెలిస్తే ?

రాముడు : అవును. మళ్ళీ ఏ మొహం పెట్టుకుని ఆయన్ని చూస్తాం ?

తిరపతమ్మ : మంచో సెడ్డో - ఆ మారాజుకు వదిలేద్దాం.

బసవయ్య : ఏం చెయ్యాలో ఆయనకే తెలుసు.

ఆయన చెప్పినట్టు నడుచుకుందాం.

అందరూ : అవును ... అవును ... అవును ...

బసవయ్య : బ్రహ్మయ్యను పంపుదాం - శివయ్యను రమ్మని ...

(అందరూ మూగవాడిని ముందుకు లాగుతారు ... ఒకంతట రాడు ... బతిమాలుతారు ... సరే ! ఉత్తరం రాసివ్వండి ... తీసుకువెడతానని సంజ్ఞలతో చెబుతాడు)

బ్రహ్మయ్య మంచి మాట చెప్పాడు

ఆయనకు ఉత్తరం రాసి పంపుదాం -

పూలపిల్ల : రాసేదెవరూ ? ...

తిరపతమ్మ : మన తుపాకి రాముడు ... నాటకాలలో వేషాలు కడతాడుగా !

రాముడు : భాగోతాల్లో ఆడతానుగాని నాకు రాయడం ఏం చేతనవును ?

టింగరి : మొన్న వేశావుగా హాస్యవేషకం - సత్యభామ దగ్గరికి ఉత్తరం తీసుకుపోయావ్ ! అట్లాగే రాయి ...

అందరూ : అవును ... అవును ... అవును ... రాయి ... రాయి ... రాయి ...

(తుపాకి రాముడు కొయ్య తుపాకీ ముందు గొట్టం తీశాడు ... అందులో నుంచి కాగితాల ఉండని తీస్తాడు ... మరో పక్క నుంచి కలం తీశాడు ... టోపీ అద్దుడుకు పెట్టుకున్నాడు ... కూనిరాగాలు తీస్తూ రాస్తున్నాడు ... ఇది చూర్ణిక)

**II చూర్ణిక II**

**II ప్రాసాదికీ ధృవ II**

రాముడు : శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులకు రాకాసుధాకర సుందర వదనార విందులు అయిన శ్రీశ్రీశ్రీ పిచ్చి మారాజులుంగారి దివ్య సమ్ముఖమునకు - అనేక సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి

చాయంగల విన్నపములు ...

(అందరూ చప్పట్లు కొట్టి తమ ఆమోదాన్ని తెలుపుతారు)

ఇచట దేవరవారి నిరంతరానంత కారుణ్య కటాక్షంబు చేత సర్వులును సుఖము ... అచట తమ శరణాగత భరణాతి పూజ్య సామ్రాజ్య విభవాతి శయంబులు వ్రాయించి పంపించగల కర్తలు ... తదనంతరంబు - మొన్నటి దినంబున మీరు మమ్మాశీర్వదించి పోయిన క్షణమ్మె మొదలుకొని మీ ఆప్త వర్గమ్మె సంతోష దుఃఖ సమాశ్వాసితులైరి ... అమ్మవారి పండుగ సంతోషకారి ... దుఖమున కంతకన్న కారణము మిక్కుటము ... ఇచటి స్థితిగతులత్యంత ప్రమాదకరంబులని తోచెడిని ... మదోన్మత్తులైన స్వార్థపరుల దుశ్చర్య లనుమానంబు గూర్చెడిని ... తమ తమ నిత్య వ్యవహార విధానమ్మెన కభ్యంతరంబు వాటిల్లంజూచి మనవారెల్లరు చింతాక్రాంతులైయుండిరి ... తమ రాకకు ముత్తెంపు చిప్ప తొలకరి వానకై ఎదురు చూచు చందమ్మెన ఎదురు చూచు చుంటిమి ... ఈ వివరంబులు మీ చిత్తంబున నాలించి ఎత్తెరంగుననైన చెచ్చెర విచ్చేయంగలరని మనవి. చిత్తగించవలెను ...

ఇట్లు - తమ ఆప్త బృందము

(అందరూ ఆశ్చర్యంగా మొహామొహాలు చూసుకుంటారు ... సంభ్రమ ఆశ్చర్యాలతో, సస్నేహంగా తుపాకి రాముడి వంక చూస్తూ)

గ్యాని : సీతారాముడూ ! ఏం చక్కగా రాశావయ్యా ! ... ముఖే ముఖే సరస్వతీ - అన్నారు ... ఇహ నుంచి మా గుండెల్లో మాటల్ని నీ నోటే పలికించాలి.

టింగరి : మా మాట నీ నోట పలికించు చిలకా !

తిరపతమ్మ : ఏడ్చావులే !

బసవయ్య : బ్రహ్మయ్యా ! ఇది మన మారాజుకు యిచ్చి ఆయన్ని బయలు దేరదియ్యి !

(మూగవాడు "నేను తప్పకుండా తీసుకొస్తానుగా" - అని సౌంజ్ఞ చేసి ఆ వుత్తరాన్ని భద్రంగా ధోవతి కొంగుకు కట్టుకొని బయలుదేరుతాడు)

## ॥ రేపటి స్వర్గం ॥

(ఆధునిక సంగీత నాటకము)

### ॥ రెండవ రంగం ॥

(కాల వ్యవధిని సూచిస్తూ లైట్లు ఆగి మళ్ళీ వెలుగుతాయి ... ఒక పక్క ఊరిజనం ... మరిక పక్క నగరజనం)

### ॥ అంతరధృవ ॥

గ్యాని : (పాడుతూ)

త్రిపుర సంహారంబు తెరగేమియని యడుగ
అమరేశునకు జెప్పెనచ్యుతుండు
త్రిపుర దనుజులు మువురు త్రిభువనముల యందు
త్రిదశులందరి తరిమివేయ
ఎలమితోద్దైత్యులు హెచ్చి యున్నారాని
సురలు రజతాద్రి కేగిరీ - భయమంది
మునివరలు మొరబెట్ట సాగిరీ ॥

అందరూ కలిసి : శరణు రజితాద్రీశ శార్వాణి హృదయేశ
శంకర పరమేశ శరణు శరణు ॥

గ్యాని : శరణన్న మాత్రాన శంభుడంతట జూచి
వెరవకుండని చాలా వెరపు దీర్చి
సమయా సమయమూలెరిగి
సమయింతు దనుజూల వెరవకుడని చెప్పగా ॥

(మూగవాడు పరుగు పరుగున వచ్చి ఏదో సౌంజ్ఞలతో చెబుతాడు)

పూలపిల్ల : పిచ్చి మారాజుగారు వస్తున్నారట ! కేతినాయుడు, మీసాల అప్పలరాజుగారు కూడా

తిరపతమ్మ : అమ్మయ్య ! ఆ మా రాజు వస్తేగాని మన మనసులు కుదుటబడవు !

టింగరి : (ఆనందంగా)

"అమ్మమ్మ ! అది అదిగో చూడండి మన అయ్యవారు -
సభకు వేంచేయుచున్నారు !"

(అని ఆనందంగా నృత్యం చేస్తాడు)

(శంఖం మోగుతుంది ... పిచ్చిమారాజు, మంత్రి కేతినాయుడు, సేనాని మీసాల అప్పలరాజు వస్తారు ... అందరూ పూర్వపు రోజుల వేషభాషలు, రాజుగారు కిరీటానికి బదులు పూలతో అల్లిన కిరీటం)

### ॥ ప్రవేశ దరువు ॥

### ॥ ప్రావేశికిధృవ ॥

పిచ్చిమారాజు : | కొలువూ కూటముకూ వచ్చెను
బృందం : | పిచ్చిమారాజుగారు ॥ కొ ॥

కుడి ఎడమల తన సచివోత్తములు
కూరిమితో పలుకాడుచునుండగ ॥ కొ ॥
సలలితముగ జన సంఘములన్నియు
పలువిధంబులను ప్రస్తుతిజేయ ॥ కొ ॥
(ఆయన అందరి దగ్గరికి వెళ్ళి పలకరిస్తూ వుంటాడు)
(రెండో జనం బిత్తరపోయి వున్నారు)

వీరాస్వామి : ఏమి ఆర్భాటం !

దొర : ఈ పిచ్చివాడెవరోయ్ కనకయ్యా !

వీరాస్వామి : పిచ్చిమారాజులన్నారు ! నిజంగా పిచ్చివాడా ఏం ఖర్మ ?

ముక్కుమనిషి : పాతకాలంలోనే బతికే జనం పల్లెటూళ్ళలో ఇప్పటికీ వుంటారని మా అమ్మ చెబుతూ వుండేది

కనకయ్య : అమ్మో ! మెల్లగా మాట్లాడండి ... ఆయనది ఈ వూరే ! ఎప్పుడో నలభై యేళ్ళనాడు ఊరు వదిలి వెళ్ళిపోయి ఈ మధ్యనే మళ్ళీ దిగనడ్డాడు ... ఊళ్ళో సాదా జనానికి ఆయన సాక్షాత్తు మహారాజే !

పిచ్చిమారాజు : (గ్యానితో) ఎట్లా వున్నావు తాతా ?

గ్యాని : (పాడుతూ) "తక్కువేమి మాకూ రాముడొక్కడుండు వరకూ" ॥

పిచ్చిమారాజు : అదుగో ! అప్పుడే కీర్తి గానాలు మొదలెట్టావ్ ! మందులు వేసుకుంటున్నావా ?

గ్యాని : ఎందుకు వేసుకోను బాబూ ?
"బొందిలో ప్రాణం ఉన్నంతవరకు
మందులు తప్పవుగా - రామకీర్తనల
మందులు తప్పవుగా" ॥

ముసలి పోలీసు : దండాలయ్యా !

పిచ్చిమారాజు : ఎట్లా వున్నావ్ వెంకటస్వామీ ?

ముసలి పోలీసు : అంతా మీ చలవ !

పిచ్చిమారాజు : నీ పెంపుడు పిల్లి ఎట్లా వుంది ?

ముసలి పోలీసు : మీ చలవ వల్ల బావుందయ్యా !

పిచ్చిమారాజు : (పిలుస్తూ) అమ్మడూ !

పూలపిల్ల : (పరుగెత్తుకుంటూ వచ్చి) ఏం అయ్యా ?

పిచ్చిమారాజు : నా కోటుకు గులాబీ తెచ్చావా ?

పూలపిల్ల : తీసుకురాకుండా ఉంటానా ? (వెనక దాచిన గులాబీని కోటుకు పెడుతుంది)

పిచ్చిమారాజు : గులాబీ అంటే నాకు యిష్టం ! మన జీవితాలను గురించి ఇది చెప్పినంత అందంగా మరేపూవు చెప్పదు ... పైన గొప్పగా కనిపించినా అడుగున ముళ్ళు

ఉండొచ్చు ... జాగ్రత్తరా - అని మనల్ని హెచ్చరిస్తూ ఉంటుంది గులాబీ !

(టింగరి టీ తీసుకువచ్చి యిస్తాడు ... పిచ్చిమారాజుకి ... ఆయన తాగుతూ)

పిచ్చిమారాజు : తిరపతమ్మా ! ఇవ్వాళ నీ టీ రోజూ టీ లా లేదేవమ్మా ?

తిరపతమ్మ : సామీ ! ఒక కప్పు టీ వంద రూపాయలవుతుందని ఆ పట్నం బాబు చెప్పిన కాడ నుంచీ కాళ్ళు చేతులు ఆడ్డం లేదు !

ముసలి పోలీసు : దానికి సంతోషించాలిగాని ... విచారం ఎందుకు ?

మూగవాడు : (పెద్దలు టీ తాగటం కంటే, వాసన చూడ్డానికే ప్రాముఖ్యం యిచ్చారని సౌంజ్ఞలతో చెబుతాడు)

పూలపిల్ల : (ఆ సౌంజ్ఞల్ని మార్చి మాటల్లో చెబుతుంది) రాగినంత సేపు వాసన చూస్తూనే తాగారట బాబూ !

పిచ్చిమారాజు : చెయ్యవలసిన పని చెయ్యవలసిన విధంగా చేయడం లేదంటే - తప్పుడు దోవన పోతున్నారని అర్థం

(అవునవునని అందరూ తలలు వూపుతారు)

పిచ్చిమారాజు : మహామంత్రీ ! సేనాపతీ !

(మంత్రి కేతినాయుడు, సేనాని మీసాల అప్పలరాజు ఏకకంఠంతో)

కేతినాయుడు
అప్పలరాజు : ఏమి సెలవు మహాప్రభూ !

పిచ్చిమారాజు : పౌరులందరూ ఇడుములు పడ
శాంతిసౌఖ్యములు కలిగియుండిరా
ఆరురుతువులు క్రమముతప్పక
ప్రజలకు హితమును కూర్చుచున్న

కేతినాయుడు : అవధారు, అవధారు అవనీపతీ !
ఆరురుతువులు పుస్తకాల్లోనే !
ఉన్న రెండే రుతువులు మనకు
ఎండాకాలం ఒకటి, మండేకాలం ఒకటి

పిచ్చిమారాజు : ఏం ? ఎందుకని ?

అప్పలరాజు : చెట్లను పడగొట్టేశాం ... మేడలు తెగకట్టేశాం ! (వయోలిన్ మీద)

కేతినాయుడు : ప్రేమను చంపేశాం ... పగనే పెంచేశాం (వయోలిన్ మీద)

అప్పలరాజు : అన్నీ మనకే కావాలనుకోడం ఎండాకాలం (వయోలిన్ మీద)

కేతినాయుడు : అవతలివాడికి ఏమీ వద్దనుకోడం మండేకాలం (వయోలిన్ మీద)

పిచ్చిమారాజు : మరి - వసంతకాలం, వర్షాకాలం ?
అవి లేకుంటే బ్రతుకేమిటి ?
ఆశల మొగ్గలు తొడగాలి - అది వసంతకాలం
(వీణ మీద / పంత్రపుష్యం)

మొగ్గలు పూలై పండాలి - అది వర్షాకాలం (వీణ మీద / పంత్రపుష్యం)
అవి రెండూ మన బతుకులు పండించాలి ... ఏమంటారు ?

అందరూ : అవును ... అవును ... అవును ...

పిచ్చిమారాజు : అందుకు ఏం చెయ్యాలి మనం ?

కేతినాయుడు
అప్పలరాజు : దశవర్ష ప్రణాళికలు సిద్ధం

పిచ్చిమారాజు : ప్రణాళికలు వద్దు ... ప్రచారాలు వద్దు ...
ప్రతి మనిషి సంతోషంగా ఉండే వైనం చూద్దాం ...
ఏ ఒక్క విషాదవదనంపై చిరునవ్వు చిందినా అది వసంతకాలం ...
ఆశయాల చిరు మొక్కల ఆశల మేఘం నర్తిస్తే - అది వర్షాకాలం ...
(అందరూ హర్షధ్వానాలు చేస్తారు)

తుపాకి రాముడు : మనం ప్రతి యేడూ పండక్కి చేసుకునే పంచభూత ఆవాహనకు అన్ని సిద్ధంగా ఉన్నాయ్ మారాజా !
మనం కొనేరు దగ్గరకు వెడితే -

పిచ్చిమారాజు : అవును కదూ ! ... పదండి ...
(అందరూ కోలాహలంగా వెడతారు ... గ్యాని తప్ప)
(వెనకాల నుంచి మంత్రాలు)

దొర : ఏమిటీ కాకిగోల (పిలుస్తూ) ఏయ్ కానిస్టేబుల్ !

ముసలి పోలీసు : (వెళ్ళేవాడు వెనక్కి వచ్చి) నన్నేనా అండీ పిలిచారు ?

దొర : అవునయ్యా ! ఏమిటీ గోల ? ఆయనెవరు ?

ముసలి పోలీసు : అయ్యబాబోయ్ ! ఆయనే తెలీదాండీ ! ఆయన పిచ్చిమారాజుగారు !

వీరాస్వామి : ఈ గుడి దగ్గర ఈ కేకలు, చప్పట్లు ఏమిటి ?

ముసలి పోలీసు : అయ్యబాబోయ్ ! ఈ గుడి ఆయన్దే నండి.

ముక్కు మనిషి : ఆయన పిచ్చిమారాజంటున్నావ్ ! పిచ్చాయనా ? కరవడు గదా ?

ముసలి పోలీసు : అయ్యబాబోయ్ ! ఆయనకు పిచ్చేమిటండీ ?

ముక్కు మనిషి : మరి పిచ్చిమారాజన్నావు !

ముసలి పోలీసు : అయ్యబాబోయ్ ! ఆయన పేరేమిటండీ అన్నారండి తమరు ... పిచ్చిమారాజని చెప్పానండి !

ముక్కు మనిషి : పిచ్చిమారాజంటున్నావ్ ! మరి పిచ్చివాడు కాదంటావేం ?

ముసలి పోలీసు : అయ్యబాబోయ్ ! ఆయనకు పిచ్చేమిటండీ ! ... ఏమయ్యా కామందూ! ఈళ్ళంతా నీకు తెలిసినోళ్ళలా ఉన్నారు ... కాస్త నువ్వయినా చెప్పు ఆయన పిచ్చిమారాజని, ఆయనకి పిచ్చిలేదని -

కనకయ్య : నే చెబుతాలే ఎంకటసామీ ! నువ్వు ఎక్కడికో పోతున్నట్టున్నావ్ ! వెళ్ళిరా !

ముసలి పోలీసు : అవునయ్యా ! పెద్ద చెరువు గట్టు మీద డూటీ యేసినారులేండి !

|  |  |
|---|---|
|  | (అపనా తనామనా మారోరి భైరన్న - అని పాడుకుంటూ మరో వైపు వెళ్ళిపోతాడు) |
| వీరాస్వామి : | బలే చోద్యంగా ఉందే ! ఒక పక్కనేమో పిచ్చిమారాజంటూ వుండిరి ... వేరొక పక్కనేమో పిచ్చిలేదంటూ వుండి ... ఈన పిచ్చోడా ? ఇక్కడి జనం పిచ్చోళ్ళా ? |
| దొర : | ఇంకాసేపాగితే, మనం పిచ్చోళ్ళమవుతాం ... ప్రపంచమంతా నాగరికత వైపుకు నడుస్తుంటే వీళ్ళు బి.సి. కాలానికి వెళ్ళాలని ! |
|  | ఇవాళ ప్రపంచంలో ఎంతముందు చూపు ? ఎంత ప్లానింగు ? పిల్లాడు పుట్టీ పుట్టగానే వీడిని అమెరికా ఎట్లా పంపించాలని, ఎట్లా డాలర్లు పంట పండించాలని పగటి కలలు కనే తల్లులున్న ఈ దేశంలో ఇంకా రాజులు, మంత్రులు - ఈ నాన్సెన్స్ ఏమిటి ? |
| ముక్కుమనిషి : | ఎట్లా కోట్లకి పడగెత్తాలి ... ఎట్లా అధికారం చేజిక్కించుకోవాలి ... అని ప్రతివాడూ మధన మడుతుంటే - డబ్బు వీళ్ళ కాళ్ళ దగ్గరికి వచ్చినా చూడలేని గుడ్డివాళ్ళేమిటి వీళ్ళూ ? |
| దొర : | జీవితంలో సంతృప్తి పడేవాడు నీకు మొదటి శత్రువురా - అనేవాడు మా గురువుగారు ... ఎక్కడ పేదవాళ్ళు ఆనందంగా ఉంటారో, ఎక్కడ పనివాళ్ళు తలెత్తుకు తిరుగుతారో - అక్కడ మన అధికారానికి ఎసరు అన్నమాట - ఇక్కడి జనం ఏ రకంగానూ ముందుకు పోవడానికి తగరు ! |
| కనకయ్య : | మీ తొందర దొంగలు తోలా ! ఇవ్వాళ యిక్కడేదో పండగ జరుగుతోంది కనక, నలుగురూ కలిసి వున్నారు కనక, ఇట్లా అంటున్నారుగాని ... మిగిలిన రోజుల్లో ఒకరికీ ఒకరికీ పడుతుందిటండీ ! |
| వీరాస్వామి : | కనకయ్యగోరు చెబుతున్న మాట బాగానే వుందయ్యా ! నాలుగు రోజులాగాక మళ్ళీ వద్దాం ! |
| ముక్కుమనిషి : | వీళ్ళు మంచిగా మాట వినకపోతే ఏం చెయ్యాలో ఆలోచించే ఉంచానుగా ! ముందు మన పేర దేవాలయ భూములు రాయించడానికి ఆ అధికారి ఎంత తీసుకుంటాడు ? ఈ ఊళ్ళో మిగిలిన భూములు మనవి కావడానికి ఎవరెవరికి ఎంత ఇవ్వాలి ? అధికార్లు మన మాట వింటే వాళ్ళకేం ముట్ట జెప్పాలి ? ఒప్పుకోకపోతే మనం ఏం చేయాలి - ఈ ప్లానంతా రెడీ ... ఎక్కడికక్కడ పకడ్బందీగా ప్లాను వేశా ... ఆ ఎదురుగుండా భవంతిలో ఉండే అధికారి 50 లక్షలకు మన పని చేశాడో - వాడి అదృష్టం - లేకపోతే ఆ భవంతి, ఆ మనిషి, ఆ డాక్యుమెంట్లూ - అవన్నీ ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు ఆంఫట్ - ఒక్కసారి పేలిపోతాయి ... మరో అయిదు నిముషాలుంది 12 గంటలకు ! |
| కనకయ్య : | కాని దాని వల్ల మనకేం లాభమండీ ? |
| వీరాస్వామి : | పిచ్చివాడా ! ఇంకా అర్థం కాలా ? అన్ని రికార్డులు మంటల్లో కలిసిపోతే నీలాంటి వాడి సాయంతో కొత్త రికార్డులు సృష్టించడం ఎంత సేపు ? (ముక్కు మనిషితో) అంతేనటారా ? |
| కనకయ్య : | ష్ ! వాళ్ళంతా వస్తున్నారు ! |

**॥ హెచ్చరిక ॥**

|  |  |
|---|---|
| గ్యాని : | (ఇంతసేపు అక్కడే వున్నాడు ... పెద్దగా పాడతాడు) |
|  | రంగా భవభంగా సత్సంగా ఉత్తుంగా |

గంగానుత శరణు భుజంగా - హెచ్చరిక, హెచ్చరిక, హెచ్చరిక !

(గుళ్ళోకి వెళ్ళిన పిచ్చిమారాజు బృందం తిరిగి వస్తారు ... గ్యాని పాట విని మొహామొహాలు చూసుకుంటారు)

కేతినాయుడు : రాజూ ! నువ్వే ఏదైనా పరిష్కారం ఆలోచించాలి !

అప్పలరాజు : అవును రాజా ! ఎంతకాలం యిట్లా ? తప్పు చేసిన వాళ్ళను ప్రతీసారీ 'పోనీలే' అనుకుంటే వాళ్ళు మరీ పేట్రేగి పోరూ ?

పిచ్చిమారాజు : ఆలోచిద్దాం ... మీరంతా మాత్రం ... (అంటూ మైమ్ లో మాట్లాడతాడు)

ముక్కుమనిషి : (రెండో పక్క) ఆశ్చర్యంగా ఉందే ... 12 గంటలు అయింది ... పేలుడన్నా జరగాలి, కుర్రవాడైనా రావాలి ... బాంబు సరిగ్గా పేలిందో లేదో -

(ముసలి పోలీసు, పడుచు పోలీసు ఒక యువకుడిని మోసుకొచ్చి టీకొట్టు పక్కన వున్న మంచం మీద పడుకొబెట్టారు ... ఏమయిందంటూ అందరూ మూగారు ... ముసలి పోలీసు కసురుకుంటాడు)

ముక్కుమనిషి : (ఆత్రంగా) ఎవరా మనిషి పోలీసాయనా ?

పడుచు పోలీసు : చూడ్డంలా ! నీళ్ళలో మునిగిన మనిషి !

రాముడు : మునిగిన మనిషంటావేమిటీ ? బట్టలేం తడవలేదే ?

పడుచు పోలీసు : ఆమాట నిజమే ! పడిపోతే మునిగేవాడే ! నేను పట్టుకున్నాను కనుక బతికాడు ... మళ్ళీ దూకబోయాడు !

రాముడు : అప్పుడు ?

పడుచు పోలీసు : అప్పుడు మా బాబ్బాయి నడిగాం ఏం చేద్దామని !

ముసలి పోలీసు : అప్పుడు నేనే చెప్పాను - ఒక్క పిడిగుద్దు యివ్వు అని !

పడుచు పోలీసు : ఇవ్వగానే పడిపోయాడు !

ముక్కుమనిషి : పడిపోతున్నవాడిని పట్టుకోవాలి గాని పిడిగుద్దులతో చంప దలుచుకున్నారా యేమిటీ ? చంపదలదుకుంటే హాయిగా పడిపోనిచ్చేవాళ్ళం గదా ?

పడుచు పోలీసు : ఆత్మహత్యా ప్రయత్నం చేస్తున్న వాడు ఆపినా వినకపోతే వాడిని స్మారకంలో లేకుండా చెయ్యాలి ... అని రూలు ... హత్యా ప్రయత్న నివారణ - పోలీసు రక్షణ నిబంధన - 2 అధ్యాయం - 11 వ రూలు - అవును గదూ బాబ్బాయ్ -

ముసలి పోలీసు : వెరీ గుడ్ - నా 30 ఏళ్ళ సర్వీసులో చెప్పిన పనిని చెప్పినట్లు చేసే పోలీసుని నిన్నే చూశాను !

పిచ్చిమారాజు : వెంకటస్వామీ ! ముందు నువ్వు చెయ్యవలసిందేమిటో చూడు ... పొగడ్తలకు పొంగిపోయి విధి నిర్వహణం మానుకో - అని సర్వీసు పుస్తకంలో లేదనుకుంటాను !

ముసలి పోలీసు : మీరెప్పుడూ అంతే అయ్యగారూ ! పొగడక పొగడక పోలీసు వాడిని ఒకడు పొగిడితే -

కేతినాయుడు : సరే సరే ! ముందు అతను స్మారకంలోకి ఎట్లా వస్తాడో చూడండి !

అప్పలరాజు : (ముక్కు దగ్గర చేయి పెట్టి) శ్వాస ఆడుతున్నట్టు లేదు !

పిచ్చిమారాజు : నువ్వు ఆగవోయ్ రాజూ ! (జేబులో నుంచి ఓ అద్దం తీసి ముక్కు దగ్గర పెట్టాడు) చూశావా ! ఇది మసకబారింది ... శ్వాస ఆడుతోందన్నమాట !

(పూలపిల్లతో) అమ్మడు ! తొందరగా నీళ్ళు -

(పూలపిల్ల నీళ్ళు తెచ్చి మొహం మీద చల్లింది ... పక్కనే కూర్చుని ఆతృతగా చూస్తున్నది)

ముక్కుమనిషి : (దూరంగా) వాడేవీడు ! జిడ్డు మొహం వెధవ ! నేను అక్కడ పెట్టి వచ్చిన బాంబు ఏం చేశాడో ! ఛీ ! వృత్తి హంతకుడిని (ప్రొఫెషనల్ కిల్లర్ని) ఉపయోగించాల్సింది !

దొర : నీ నిర్ణయం చెప్పెయ్యేడు కదా ?

ముక్కుమనిషి : ఏడిశాడు ... చూస్తూ ఉండండి (ముసలి పోలీసుతో) ఏం చేద్దామనుకుంటున్నావ్ అతన్ని ?

ముసలి పోలీసు : ఏం చెయ్యడమేమిటి ? ముందు శ్వాస తెప్పించాలి !

(అతని ఛాతీ మీద రుద్దే ప్రయత్నం చేశాడు)

ముక్కుమనిషి : అట్లా చేసేది నీటిలో మునిగిన వాళ్ళకి -

పడుచు పోలీసు : మరి ఇతనికి ?

ముక్కుమనిషి : అతన్ని మళ్ళీ ఎత్తుకుపోయి నీళ్ళలో పడేయ్ !

పడుచు పోలీసు : పడేస్తే ?

ముక్కుమనిషి : నువ్వు దూకి అతన్ని రక్షించు ... నీకప్పుడు మెడల్ కూడా రావచ్చు!

పడుచు పోలీసు : నాకు ఈత రాదే !

దొర : రాకపోతే దూకాక నేర్చుకుంటావ్ ! నువ్వు పుట్టక ముందు నీకు గాలి పీల్చడం వచ్చా ? ఇదీ అంతే !

పడుచు పోలీసు : ఇదేదో బాగానే వుందే ! పోనీ, బాబాయ్ ! నీకు ఈదడం వచ్చా ?

ముసలి పోలిసు : వచ్చు ... రాదు ... అవన్నీ ఎందుకు ? నాకు నీళ్ళ గండం ఉంది ... నేను ఎప్పుడూ నీళ్ళలోకి దూకను - అని మా ఆవిడకి మాటిచ్చాను !

పిచ్చిమారాజు : కాస్త తేరుకున్నాడా ? (మంచం దగ్గరికి వస్తున్నాడు)

వీరాస్వామి : (మెల్లగా) ముసలాడు (తన వాళ్ళతో గుసగుసలాడతాడు)

దొర : మనం కాసేపు అవతల ఉందాం ... పదండి (నలుగురూ వెడతారు)

(పూలపిల్ల యువకుడి వంక చూస్తూనే వుంది ... అతను కళ్ళు తెరిచాడు)

పూలపిల్ల : (ఆనందంగా) అదుగో ! ఆయన కళ్ళు తెరిచాడు)

యువకుడు : నేను ... నేను ... ఎక్కడున్నాను ?

ముసలి పోలీసు : ఏట్లో ఉండవలసిన వాడివి గుళ్ళో ఉన్నావు !

పూలపిల్ల : ఎంత అందంగా ఉన్నాడు ?

కేతినాయుడు : ఎందుకయ్యా ? ఎందుకంత అఘాయిత్యానికి పాల్పడ్డావ్ ?

పడుచు పోలీసు : ప్రేమ బెడిసి కొట్టిందేమో !

అప్పలరాజు : ఎవరన్నా మోసం చేశారేమో !

పిచ్చిమారాజు : అతను ఎందుకు ఆ పని చేయాలనుకున్నాడో అన్నదిప్పుడు ముఖ్యం కాదు !

కేతినాయుడు : మరి ?

పిచ్చిమారాజు : ముందు అతనికి జీవితం మీద మమకారం కలిగించాలి ... అతనిలో మళ్ళీ చావాలి అన్న ఆలోచన రాకుండా చెయ్యాలి !

ముసలి పోలీసు : చావాలనుకున్న వాడికి బతుకుమీద మమకారం కలిగించడం ఎలానండీ ?

పిచ్చిమారాజు : ప్రయత్నం చెయ్యి ... ఊఁ ! నువ్వే వెంకటస్వామీ !

ముసలి పోలీసు : (గొణుక్కుంటూ) ఏమిటో ... చూడబ్బాయ్ ! నువ్వు ఆత్మహత్య చేసుకుందామని చూస్తున్నావ్ ... అది పెద్ద నేరమ్ ... సెక్షన్ 306 కింద నీకు ఆరేళ్ళు జైలు శిక్ష ... కటకటాల వెనక జైలు కూడు తింటూ !

పిచ్చిమారాజు : బాగుంది వెంకటస్వామీ ! బతుకు మీద ఆశ కల్పించవోయ్ అంటే - చావు, ఆత్మహత్య, జైలు అంటావేమిటీ ?

ముసలి పోలీసు : అవునండి ... జనాన్ని తప్పుల్నుంచి దూరంగా ఉంచడానికే గదా పోలీసులున్నది !

పిచ్చిమారాజు : కాదు ... సక్రమమైన మార్గం ఏమిటో చూపడానికి - పోనీ - నువ్వు జీవితంలో చాలా యిష్టపడేవాటిని గురించి చెప్పు - అతనికీ అవి యిష్టం కావచ్చు !

కేతినాయుడు : వెంకటస్వామీ ! నాకు తెలుసు నీకేమిటి యిష్టమో ! మూడు ముక్కలాట -

ముసలి పోలీసు : భలేవారే కేతి నాయుడు గారూ ! ఏదో పెళ్ళిళ్ళలో -

పిచ్చిమారాజు : (పూలపిల్లతో) పోనీ నువ్వు చెబుతావా అమ్మడూ ?

(పూలపిల్ల సిగ్గుపడి లేచి వెళ్ళిపోతుంది)

రాముడు : బతుకు మీద ఆశను కల్పించడం ! ... చాలా బాగుంది బాబుగారూ ! కాని ఎట్లా చెప్పాలో తెలియడం లేదయ్యా !

పిచ్చిమారాజు : చాలా తేలికర్రా ... జీవితం అంటే ఎన్నో ఇబ్బందుల్ని అధికమించే ప్రయాణంగా చూస్తాం అందరం ... అంటే - ఇబ్బందుల్నే చూస్తాం గాని సుఖాన్ని చూడం (యువకుడి వంక తిరిగి) చూడు చైతన్యా !

యువకుడు : నా పేరు చైతన్య కాదండీ ! ... సుబ్బారావు !

పిచ్చిమారాజు : ఉత్సాహంగా ఉండే యువకులంతా నాకు చైతన్య స్వరూపాలే ! చూడు చైతన్యా ! జీవితం అంటేనే చైతన్యం కదా ... మనం నిత్యమూ ఆ చైతన్యాన్ని, ఆ అందాన్ని అనుభవిస్తూ జీవించాలి ... నా మటుకు నేను - పొద్దున్నే లేస్తానా? కాస్త బద్ధకంగానే వుంటుంది ... కళ్ళు నులుపుకొని లేచి కిటికీ తలిపు తెరుస్తాను - అనంత ప్రపంచంలోకి ... తెల్లవారుతూ వుంటుంది ... పక్షుల కలకలారావాలు - జగత్తును మేల్కొలపడానికి ... వాకిట్లోకి వస్తాను ... చల్లని పిల్లగాలి నా ఒంటిని సుతిమెత్తగా తాకుతూ వెడుతుంది ... దొడ్లోకి వెడతాను ... ఆవుదూడ తల్లిదగ్గర పాలు తాగుతూ ... ప్రేమకి ఇంతకన్నా గొప్ప ప్రతీక నెక్కడ తేగలం ? ... చిన్న పిల్లవాడు బుడి బుడి అడుగులతో నడిచే ప్రయత్నం చేస్తుంటే పడిపోతాడేమోనని తల్లడిల్లే తల్లి గుండె చప్పుళ్ళు విన్నావా ? ఆ ఆప్యాయత నీకు ధన్నుగా నిలబడితే నువ్వు జీవితంలో సాధించలేనిదేమిటి ? ... పిల్లవాడు నడవలేడని బుజాల మీదకు ఎత్తుకుని ప్రపంచంలో ఉన్న కొత్త వింతల్ని చూపే తండ్రుల మెరిసే కళ్ళను చూడు ... ఒక మంచి పని చేస్తే ఆనందంతో గర్వంతో విప్పారే గురువుల కళ్ళలోకి చూడు ... మంచి పని - ఎంత చిన్న పనైనా చేస్తే నీ పక్కవాళ్ళు చూపించే ప్రేమాస్పదాలు చూడు ... అందుకే చుట్టూ వున్నవాళ్ళ కోసం బతకడం చేతనయితే బతుకంతా ఆనందమయం కాదూ ?

యువకుడు : (ఉత్సాహంగా) చెప్పండి -

పిచ్చిమారాజు : (నవ్వుతూ) జీవితమంటే నీకు ఉత్సాహం వచ్చిందీ అంటే నీకు బతకాలన్న ఆశ కూడా కలిగిందన్నమాట ! ఇక్కడున్న వాళ్ళని చూడు ... ప్రతివాళ్ళు అవతలి వాళ్ళకు తమకు చేతనైన సహాయం చేద్దామనుకునే వాళ్ళే ! పంచుకుంటే జీవితం ఆనందం ! అనంతం ! ముడిచి పెట్టుకుంటే అంతా అంధకారం ! అయోమయం !

యువకుడు : నేనెంత పొరపాటు చేశాను !

పిచ్చిమారాజు : అందుకే జీవితం మనల్ని శాసించకూడదు ... మన కిష్టమయిన పనిని స్వేఛ్ఛగా చేయగలిగితేనే ఆనందాన్ని గుండెల నిండా నింపుకోగలం !

ముక్కుమనిషి : (వస్తూనే దాష్టీకంగా) ఏయ్ సుబ్బారావ్ ఇటు వచ్చేయ్ !

యువకుడు : నేను రాను ... నాకు ఇక్కడే బావుంది !

ముక్కుమనిషి : నేను చెబుతున్నాను ... వచ్చేయ్ ... నా సంగతి తెలుసుగా !

యువకుడు : (పిచ్చిమారాజుతో) ఇక లాభం లేదండీ ! ... నేను వెడతాను !

పిచ్చిమారాజు : అక్కర్లేదు !

ముక్కుమనిషి : ఎందుకు చెబుతున్నానో విను ... ఆ తరవత విచారిస్తావ్ !

యువకుడు : (పిచ్చిమారాజుతో) నా చెయ్యి వదలండి ... నేను వెళ్ళక తప్పదు !

పిచ్చిమారాజు : నేను ఒకసారి ఒకరి చెయ్యి పట్టుకుంటే ... దానిని విడిపించడం ఎవరి తరమూ కాదు !

ముక్కుమనిషి : (యువకుడ్ని లాగుతూ) నీకు కాదూ చెప్పడం ... పద ... మీరెవరో నాకు తెలియదు కాని అతన్ని వదిలిపెట్టండి ... అతను మా మనిషి !

పిచ్చిమారాజు : మీతో రానంటున్నాడు ... మీ మనిషి ఎలా అవుతాడు ?

ముక్కుమనిషి : నా సంగతి మీకు తెలియదు ... ఎందుకు చెబుతున్నానో వినండి ... లేకపోతే చాలా దారుణమైన పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వుంటుంది !

యువకుడు : నేను వెడతానండీ ! నా వల్ల మీకు ఎటువంటి ముప్పూ రాకూడదు !

ముక్కుమనిషి : ఏయ్ పోలీస్ ! ఇక్కడ ఒక ముసలాయన తనకు సంబంధమ్ లేని ఒక మనిషిని కట్టి పడేస్తే ఏమీ తెలియనట్లు అట్లా నిలబడతావేం ? ఆయన్ని అరెస్టు చెయ్యి !

ముసలి పోలీసు : ఎందుకు అరెస్టు చేయాలంటారు ?

ముక్కుమనిషి : మా మనిషిని నిర్బంధిస్తున్నాడు కనుక !

రాముడు : ఆ కుర్రాడు చిన్నతనంలోనె తప్పిపోయిన ఆయన కొడుకు కావచ్చునేమో ?

పడుచు పోలీసు : తన దూరపు బంధువు ... తనకున్న ఒకే ఒక్క వారసుడు కావచ్చునేమో ?

ముక్కుమనిషి : అబద్ధం ... అతను మా మనిషి !

ముసలి పోలీసు : ఏమిటి రుజువు ?

ముక్కుమనిషి : అతన్నే అడగండి !

యువకుడు : అబద్ధం !

(మూగవాడి సౌంజ్ఞలు ... పూలపిల్ల వ్యాఖ్య)

పూలపిల్ల : ఈయన ప్రాణాలకే ప్రమాదంట ... అతన్ని చంపడానికి పన్నాగం పన్నారట !

ముక్కుమనిషి : అంతా అబద్ధం ... చూడు సుబ్బారావ్ ! ఆఖరి సారి హెచ్చరిస్తున్నాను ... రా ! ... (అని లాగుతాడు ... అందరూ అడ్డంగా నిలబడతారు)

అందరూ : రాడు ... మేం రానివ్వం !

ముక్కుమనిషి : ఇదుగో ! చెబుతున్నాను ! జాగ్రత్త ! ఇహ నా తడాఖా ఏమిటో చూపిస్తాను ... ఖబడ్దార్ (కోపంగా వెళ్ళిపోతాడు)

యువకుడు : అయ్యగారూ ! నన్ను రక్షించారు !

పిచ్చిమారాజు : ఏమయింది ? ఏమిటి నీ మీద ఆయన దౌర్జన్యం ? ఎవర్నయినా హత్య చేశావా?

యువకుడు : అమ్మో ! హత్యే ? (లేదన్నట్టు తల తిప్పుతాడు)

పిచ్చిమారాజు : మరి ?

యువకుడు : నేనొక ఫోర్జరీ చేశాను !

పిచ్చిమారాజు : ఎవరిది ? ఆయనదా ?

యువకుడు : మా నాన్నగారిది ... ఆయన అప్పు తీసుకున్న నోటు మీద ...

పిచ్చిమారాజు : ఆ నోటు ఈయన దగ్గర వుంది ... అంతేనా ? (యువకుడు అవునని తలూపుతాడు) దానిని అడ్డు పెట్టుకుని నిన్నేదో చెయ్యమని ఒత్తిడి చేస్తున్నాడు ... అవునా ?

యువకుడు : ఆయన చెప్పిన పని చేస్తే కాగితం చించేస్తానన్నాడు ... కాని ... కాని ... ఆ పని నేను చెయ్యలేకపోయాను !

పిచ్చిమారాజు : అంత ప్రమాదకరమైన పనా ?

యువకుడు : ఈ చుట్టుపక్కల ఉళ్ళన్నింటిని నాశనం చేద్దామని చూస్తున్నాడు !

పిచ్చిమారాజు : (నవ్వుతూ) అది అతని వల్ల అయ్యే పనేనా ?

యువకుడు : నవ్వకండయ్యా ! అతను చెయ్యగలడు ... అంత పంతం ఉన్న మనిషి! డబ్బు, పరపతి ఉన్న మనిషి ! ఎవరినైనా కొనగలడు ... దేన్నయినా స్వంతం చేసుకోగలడు ... మూడు నెలల్లో ఈ భూముల్ని తవ్వుతారట! ఈ గుడితో సహా !

అందరూ : ఆఁ !

పిచ్చిమారాజు : ఏం చేస్తారట తవ్వి ?

యువకుడు : ఈ కిందంతా పెట్రోలు బావులున్నాయట ! అందుకోసం ఈ భూముల్ని కొని వాటిలో తవ్వకాలు చేస్తారట !

పిచ్చిమారాజు : ఇంత అందమైన ఉళ్ళని, హాయిగా బతికే జనాన్ని ఇబ్బంది పెట్టడానికి ఎన్ని మార్గాలు దొరుకుతాయి జనానికి ! అవన్నీ జరగవులే !

బసవయ్య : మారాజుగారూ ! మీకు అసలు సంగతి తెలిస్తే ?

పిచ్చిమారాజు : అసలు సంగతేమిటి ?

రాముడు : చెబుదామా ?

పిచ్చిమారాజు : ఏమిటి చెప్పాలి ? మీరేదో దాస్తున్నారు !

బసవయ్య : నువ్వే చెప్పాలి సీతారాముడూ !

పిచ్చిమారాజు : మీ మాటలు వింటుంటే నాకు భయం వేస్తున్నది ... ఏమిటి మీరు చెప్పదలుచుకున్నది ? (నిశ్శబ్దం) చెప్పండి !

అందరూ : చెప్పు ... చెప్పు ...

రాముడు : ఏం చెప్పనేం చెప్పను ?

పిచ్చిమారాజు : మీరందరూ ఎందుకంత భయపడుతున్నారు ? ఏమిటి ? చెప్పండి !

## ॥ జనకథనం ॥

## ॥ ఆక్షేపకిధ్రువ ॥

రాముడు : ఏం చెప్పమేం చెప్పము ? ఈ కలిగినోళ్ళ ఆగడాలు ॥ ఏం ॥
డబ్బు మదం నెత్తికెక్కి డబాయించి బతుకుతుంటే ॥ ఏం ॥
మంచిగ బతకాలని ప్రతి మనిషికి ఆశ లేదా !
దానిని మొగ్గలోనే తుంచేస్తే బాధ కాదా ?
డబ్బుల సంపాదన కోసం -

ముసలి పోలీసు : డబ్బు మనిషికి అవసరం కదా ?

రాముడు : డబ్బు మనిషికవసరమే - ఔననుకో !
అందుకు అత్యాశకు పోవడం అవసరమా ?
తరతరాల మనుగడ కోసం
తరగని ధనరాసులెందుకు ?
సొంత జనం సుఖం కొరకు
ఇతరుల కడుపులు కొడితే
తప్పు కదా ! అది తగదు కదా !
దాష్టీకం డబ్బు కలిసి అమాయకుల నోరు కొట్టి
అరచకం సృష్టిస్తే - ఏం చెయ్యమేం చెయ్యము ?

తిరపతమ్మ : అధికారగణమంత అడ్డదారులుతొక్కి
ఉన్నవాఇకె ఎపుడు ఊడిగం చేస్తుంటె ॥ ఏం ॥

బసవయ్య : ధనమధికారం కలిసి నడుస్తూ
రాజకీయ రారాజుల కండగ
మారణహోమం చేస్తూ పోతే ॥ ఏం ॥

రాముడు : పరరాజుల రాజ్యం కాదు గదా !
మనమెన్నుకున్న మన ప్రతినిధులే కదా !
అందలమెక్కిన ప్రతివాడూ
అందరానివాడైపోతే **॥ ఏం ॥**
అందలమెక్కించిన ప్రజలం

| | | |
|---|---|---|
| | అంటరానివాళ్ళమైతే | ॥ ఏం ॥ |
| అందరూ : | కష్టం ఒక్కరిదై ఫలితం వేరొకరిదైతే | ॥ ఏం ॥ |

పిచ్చిమారాజు : అధికారం, ఆత్మీయత కధ్దం పట్టాలి గాని
ఆర్తుల, వ్యధ జీవుల బ్రతుకులతో వ్యాపారం చేయరాదు
నీపై నమ్మకముంచిన మనుషుల కన్యాయం చేయరాదు
అధికారం, ధాష్టీకం, రాజకీయ కపటత్వం
విద్రోహం, విధ్వంసం ఇంకానా ఇకపై చెల్లవు

కేతినాయుడు : పిచ్చిమారాజా ! అది అంత తేలికగాదయ్యా ! వాళ్ళు ఊసరవెల్లిలా ఎన్ని ముఖాలు మారుస్తూ ఉంటారో నీకు తెలియదు.

రాముడు : ఒక దొరగారి బండారం బయటపడితే మర్నాడే ఆయన పేద్ద వ్యాపారవేత్తగా దర్శనమిస్తాడు

బసవయ్య : వ్యాపారవేత్తను పట్టుకుంటే మరుక్షణంలోనే రాజకీయ నాయకుడవుతాడు

రాముడు : ఆయన్ని పట్టుకుంటే మంత్రి అవుతాడు ... ఆయన్నీ పట్టుకుంటే -

యువకుడు : వీళ్ళు చెబుతున్నదంతా నిజం మారాజా ! వీళ్ళకున్న దురాశ -

పిచ్చిమారాజు : ఏమీటీ ! దురాశా ?

యువకుడు : అవును ... ఉన్నది చాలదు ... ఇంకా ఇంకా కావాలి ... అందుకు ఏమైనా చేస్తారు

పిచ్చిమారాజు : వాళ్ళు దురాశాపరులైతే వాళ్ళను అణచడం అంత కష్టం కాదు ... చైతన్యా! రేపటితో నీకు స్వేచ్ఛ ! సీతారాముడూ ! నీ తుపాకీకీ పనే ఉండదు ... బసవయ్యా ! నువ్వింక ఎలుగెత్తి జనాన్ని మేల్కొలిపే పాటలు పాడక్కర్లేదు

అప్పలరాజు : ఏం చేస్తానంటావ్ ?

పిచ్చిమారాజు : (నవ్వి) చెబుతాగా ! ముందు అందరం అమ్మవారి గుడిలోకి

కేతినాయుడు : మిత్రులారా ! అందరి కోసం గుళ్ళో ప్రసాదం చేయించాం - పదండి

పిచ్చిమారాజు : పదవోయ్ చైతన్యా ! పద -

(చైతన్య వెడుతూ పూలపిల్ల వంక నవ్వుతూ చూశాడు ... ఆమె సిగ్గుపడుతుంది)

॥ పూలపిల్ల ప్రేమగీతం ॥

॥ ప్రాసాదికీధృవ ॥

పూలపిల్ల : (తనలో తాను)
ఎవరో, ఎవరో - ప్రేమించామని, ప్రేమిస్తామని
మాటల బాసలు చేశారు - మూటల ఆశలు విసిరారు
ఏనాడూ, ఏనాడూ నే తొందరపడలేదు
నా గుండేమో - తత్తర పడలేదు
ఈనాడో ? ... ఈ నాడేమో -
ఎవరూ, ఎవరూ ప్రేమించామని, ప్రేమిస్తామని
మాటల బాసలు చేయలేదు ; మాట మాత్రమూ అనలేదు

అయినా ఎందుకు ? అయినా ఎందుకు గుండెకు ఆరాటం ?

ఒళ్ళంతా ఈ స్వేదం ఎందుకు ?

రెప్పల మాటున రెపరెపలాడే కనిపించని ఆవేదన ఎందుకు ?

ఎదకూ వ్యధకూ ఏమిటి బంధం ?

వ్యధ చెందే ఆ ఎదకే తెలుసు - వేదన బరువెంతో !

(ఒంటరిగా దిగులుగా కూర్చుంది)

(పూలపిల్ల ఒక్కతే దిగులుగా కూర్చుని ఉన్నది ... టింగరి, మూగవాడు వస్తారు ... ఎందుకట్లా వుందని కళ్ళతోనే అడుగుతాడు టింగరి ... మూగవాడు - ఆమె యువకుడి కోసం దిగులు పడుతున్నదని చెబుతాడు ... టింగరి ఆమె కళ్ళు మూస్తాడు ... ఆమె ఉలిక్కిపడ్డది ... టికొట్టు తిరపతమ్మ పూలపిల్ల దగ్గరకు పోయి చిబుకం ఎత్తి కళ్ళల్లోకి చూస్తుంది ... ఆమె తల తిప్పుకుంటుంది)

తిరపతమ్మ : ఏమిటి పిల్లా అట్లా వున్నావ్ ? ఛ !

II ఏలపాట II

II ఆక్షేపకీధృవ II

చందమామ అందమందురె ... ఓ ఒప్పులకుప్ప

నీ మొగమేల వాడె చెప్పవే **II**

పూలపిల్ల : ఎంతాటి అందమైన ! రాహుకేతువులకమ్మ

వాడాక అట్టే ఉండేనా ? ఓ వయ్యారి భామ **II** వాడాక **II**

తిరపతమ్మ : దానిమ్మ గింజలంటివె **II** ఓ ఒప్పులకుప్ప **II**

నీ పలువరస పటపటలేలనే !

పూలపిల్ల : ఆకాశాన ఉరుము ఉరిమె ముక్కంటి ఢమరుమోగె

పలువరుస పటపటలాడదా ? ఓ వయ్యారి భామా **II** పలువరుస **II**

తిరపతమ్మ : నల్లని చెరుకువంటివె **II** ఓ ఒప్పుల కుప్పా **II**

నీ బొమలేల వంగె చెప్పవే **II**

పూలపిల్ల : హనుమంతూని తోకవంగె అర్జూనుడి విల్లువంగె

నా బొమల ఊసదేలనే ? ఓ వయ్యారి భామా **II**

తిరపతమ్మ **:** **(**దగ్గరకు వచ్చి గడ్డం పైకెత్తి)

మొగమంత వాడిపోయె పలువరస పటపటలాడె

బొమలేమొ వంగి నిలిచె మనసంతా గుబులైపోయెనే

II ఓ ఒప్పులకుప్పా II

నీ మనసు వివరం తెలిసేనే

మన పెద్దాయన చెవిని వేస్తామే

నీ గుబులంత తీర్చి వేస్తామే II ఓ ఒప్పులకుప్పా II

**(**అందరూ గుడిలో నుంచి వస్తారు)

పిచ్చిమారాజు : ఇంత అందమైన ప్రపంచం అకస్మాత్తుగా ఇంత ప్రమాదకరం ఎట్లా అయింది కేతినాయుడూ ?

కేతినాయుడు : ప్రపంచం మారిపోయింది రాజూ ! మన చిన్నతనంలో వూరు ఎట్లా వుండేదో నీకు జ్ఞాపకం వుందా ? ప్రతి ఒక్కళ్ళూ మన లాంటి వాళ్ళే ! కాస్త ఎక్కువ డబ్బు! కాస్త తక్కువ అంతస్థు ! కాని నిత్య జీవితంలో మన మధ్య తరతమ భేదాలుండేవి కాదు

పిచ్చిమారాజు : ఇప్పుడవన్నీ లేవంటావా ?

కేతినాయుడు : లేవు రాజూ లేవు ... ఇప్పుడు పైపై పతారాలకి పెద్దపీట ! నలగని బట్టలకి, ఇంటి హొషుకు, నువ్వు ఖర్చుపెట్టే డబ్బుకు, వేసుకున్న నగలకి, కొన్న కారుకీ - వీటికి గుర్తింపు ...

అప్పలరాజు : పైపై ఆడంబరాలకే గౌరవం

కేతినాయుడు : మనుషుల మధ్య మమతలే చచ్చిపోతున్నాయి రాజూ !

పిచ్చిమారాజు : నమ్మలేకుండా ఉన్నాను ... నాకెందుకు తెలియలేదు ?

రాముడు : మీరెప్పుడూ మీ కలల లోకంలో ఉంటారు బాబూ ... అందరి బాగూ కోరుతారు ... అందరికీ మంచి చేస్తారు ... ఎంత అర్ధరాత్రి మీ తలుపు తట్టినా ఓ మంచి మాటా, సేద తీర్చే మమతా నీ నుంచి వస్తాయి ... మిమ్మల్ని బాధ పెట్టడం మాకిష్టం లేదు బాబూ !

బసవయ్య : కాని ఇవాళ పరిస్థితి విషమించింది ... కళకళలాడే పూలతోటలోకి నాగుపాములు వచ్చి చేరుతున్నాయి మారాజా !

పూలపిల్ల : మమ్మల్ని ఈసడిస్తున్నారయ్యా !

తిరపతమ్మ : అవమానిస్తున్నారు !

టింగరి : కసిరి కొడుతున్నారు ...

పిచ్చిమారాజు : నమ్మశక్యం కాకుండా ఉందే !

బసవయ్య : రాను రాను దళారీలు పెరిగిపోతున్నారు ... ధనవంతులకీ, అధికారులకీ, నాయకులకీ ఈ దళారీలు గులాములు ... మన మధ్య కొస్తారు ... వాళ్ళ పనులు చేసి పెడతారు ... మధ్యలో వాటా కావాలంటారు ... ఈ దళారీలే బాబు ముందు రౌడీలవుతారు ... ఆ తరవాత ఛోటా నాయకులుగా ఎదిగిపోతారు ... పదవుల్లోకొస్తారు ... ఇట్లా ఎదిగిపోయి ఎదిగిపోయి మన జీవితాల మీద పెత్తనాలు చేస్తున్నారు

పిచ్చిమారాజు : ఎంత అమానుషం ?

రాముడు : పండే పంటలకు దళారీలు ... తినే తిండికి దళారీలు ... ఉండే ఇళ్ళకు దళారీలు ... మనం బతకలేం అయ్యా !

బసవయ్య : ఈ మాత్రం స్వతంత్రంగా మాట్లాడుకోవడానికి మనమే ఆఖరు వాళ్ళం బాబూ ! ... మా పిల్లలకి ఈ మాత్రం స్వేచ్ఛ కూడా ఉండదు ... అడుగడుగునా మనల్ని మన జీవితాలని శాసించే జనం వస్తున్నారు మారాజా ! అదీ - అదీ మన భవిష్యత్తు !

అందరూ : బతకడమంటే భయమేస్తోందయ్యా !

పిచ్చిమారాజు : ఆపండి ... ఆపండి ... ఆపండి ... దీనికి విరిగుడేమిటో కనిపెడదాం ... ప్రతి

వ్యాధికీ మందుంది ... ఇంకా ముదిరితే దుష్టాంగబు ఖండించి - అని వైద్యశాస్త్రం చెబుతోంది

(అటూ ఇటూ దీర్ఘంగా ఆలోచిస్తూ తిరుగుతున్నాడు ... అకస్మాత్తుగా ఏదో తట్టిన వాడిలా)

ఆఁ ! అమ్మడూ ! అమ్మడూ ! సీతారాముడూ ! ఇక్కడ కొంచెం కిరసనాయిలు దొరుకుతుందా ?

తిరపతమ్మ : ఉన్నదయ్యగారూ !

పిచ్చిమారాజు : కొంచెం చాలు ... ఒక సీసాలో వేసి దానిలో కాసిని నీళ్ళు కలిపి లోపల కాస్త ఒంట్రుమట్టి వేసి తీసుకురా -

కేతినాయుడు : ఇప్పుడు ఇక్కడ కిరసనాయిలు ఎందుకయ్యా ?

అప్పలరాజు : ఒక్క మాట చెప్పరాదూ ... ఏం చెయ్యబోతున్నావో !

పిచ్చిమారాజు : తొందరపడకు రాజూ !

(టీకొట్టు తిరపతమ్మ సీసా తీసుకువస్తుంది ... పిచ్చిమారాజు దానిని వాసన చూసి)

భేష్ ! బాగుంది ... ఇది నీ దగ్గర వుంచు సీతారాముడూ ! (ఇస్తాడు)

ఇప్పుడు నాకు ఉత్తరం రాసే మనిషి కావాలి ...

బసవయ్య : మన పూలపిల్ల రాస్తుంది !

పిచ్చిమారాజు : ఆడపిల్లలు వద్దులే !

బసవయ్య : మన సీతారాముడు రాస్తాడుగా ! బ్రహ్మాండంగా రాస్తాడు ! పొద్దున మీకు ఉత్తరం రాసింది రాముడెనయ్యగారూ !

పిచ్చిమారాజు : పొద్దున లాగా కాకుండా కాస్త జనానికి అర్థం అయ్యే భాషలో రాయి !

(మళ్ళీ తుపాకీ ఒక పక్క నుంచి కాగితం, రెండో పక్క నుంచి కలం తీస్తాడు)

పిచ్చిమారాజు : తుపాకీ కవిత్వాలు చెప్పే రోజులొస్తున్నాయన్నమాట ! మనకీ తుపాకులు తూటాలు వద్దు ... మాటల తూటాలు తెప్పిస్తే చాలు ... రాయి ... ఆఁ ! ఇందాక సూటు బూటు వేసుకున్న మనిషిని ఏమని పిలుస్తారు వాళ్ళు ?

యువకుడు : ఆయనే "దొర" గారు !

పిచ్చిమారాజు : (నవ్వి) దొరగారు ! ... రాయి - (తుపాకి రాముడు రాస్తున్నాడు)

శ్రీశ్రీ దొరగారు ! ... రాయి ... (తుపాకి రాముడు రాస్తున్నాడు)

అయ్యా ! ఈ ఊరు చివర పాడుబడ్డట్టు కనిపించే పెద్ద బంగళా వుంది... దాని భూగృహంలో పెట్రోలు పడ్డట్టు మా వాళ్ళు కనుక్కున్నారు ... నేను కూడా చూశాను ... చాలా బావులుండొచ్చు ... ఆ యిల్లుగలాయనని నిన్న మనం చూశాం ... ఆయనకు మతిస్థిమితం లేదు ... పిచ్చి ... అందువల్ల ఈ విషయం ఇంతవరకు బయటకు తెలియలేదు ... ఆయన్ని లాలించి, భయపెట్టి ఈ నిక్షేపాల్ని మనం స్వంతం చేసుకోవాలి ...రేపు సాయంత్రం నాలుగు గంటలకు అక్కడకు చేరుకోగలరు ... అక్కడ వున్న నీటి నమూనాను ఒక సీసాలో పోసి పంపుతున్నాను ... ఇట్లు -

(ఆగి) ఆఁ ! అన్నట్టు ఆ వాసన్ల రాయుడి పేరేమిటి ?

యువకుడు : పేరు తెలియదు గాని ... ఆయనే విలనండి ... అందరూ ముక్కు మనిషి అంటారు

పిచ్చిమారాజు : ఆయన సంతకం నీకు తెలుసా ?

యువకుడు : ఓ ! ఆయన ఆఫీసర్ని భయపెడుతూ రాసిన ఉత్తరం మీద సంతకం పెట్టాడు ... నిన్నటి నుంచి దాన్ని వెయ్యిసార్లయినా చదివాను !

పిచ్చిమారాజు : ఆయన సంతకం పెట్టగలవా ? (తలూపుతాడు యువకుడు) పెట్టు (పెడుతూ వుండగా) ఒక ఫోర్జరీ రెండో ఫోర్జరీతో రద్దు ! ... బసవయ్యా ! ... మన యింటి మేస్త్రీ - మాకు తరతరాలుగా పనిచేసే మనిషి - అతని పేరేమిటి ?

బసవయ్య : నరసింహ - బాబూ !

పిచ్చిమారాజు : అతన్ని ఒకసారి రేపు మధ్యాహ్నం రెండు గంటలకి ఇంటికి రమ్మన్నానని చెప్పు ... అతనితో కొన్ని రహస్య విషయాలు మాట్లాడాలి !

బసవయ్య : అట్లాగే బాబూ !

అప్పలరాజు : నువ్వు చేస్తున్న పని ఒక్కటీ అర్థం కావడం లేదు !

పిచ్చిమారాజు : అందుకే కదా నాకు 'పిచ్చిమారాజు' అన్న బిరుదిచ్చారు అందరూ ! ... ఇహ ఇవాళ్టికి మన సభ చాలిద్దాం ... రేపు ఎక్కడ ఎప్పుడు కలవాలో కబురు పెడతాను ... అందరూ అప్రమత్తమై వుండాలి ... చైతన్యా ! నువ్వు నాతో పాటు మా యింటికి వస్తున్నావు - పద !

(రెండడుగులు వెయ్యగానే ... ముక్కు మనిషి, దొర, బొక్కసం వీరాస్వామి దూకుడుగా వస్తారు ... వెనక ముగ్గురు మనుషులు)

ముక్కుమనిషి : ఎక్కడికి వెడుతున్నావ్ సుబ్బారావ్ ? నిన్ను అంత తేలికగా వదిలి పెడతామనుకున్నావ్ కదూ ?

వీరాస్వామి : పద - మాతోపాటు !

యువకుడు : నేనిందాకే చెప్పాను రానని !

దొర : ఎందుకురావో చూద్దాం ...

ముక్కుమనిషి : నీకు చెప్పిన పని ఏమయింది ? అందుకోసం యిచ్చిన డబ్బు ఏం చేశావ్ ? (రెండడుగులు కదిలాడు) సమాధానం చెప్పి కదులు !

(యువకుడు పిచ్చిమారాజు వెనుకకు వెళ్ళి నిలబడ్డాడు ... పూలపిల్ల బిక్కుబిక్కుమంటూ చూస్తున్నది)

వీరాస్వామి : (యువకుడి దగ్గరకు పోయి) నీకిచ్చిన లక్షలు ఏం చేశావో చెప్పు - లేదా -

గ్యాని : (మధ్యలోకి వచ్చి) వాదులాడ తగునా ? వ్యర్థపు మాటలాడ తగునా?

(బొక్కసం వీరాస్వామి గ్యానిని తోసేస్తాడు ... గ్యాని మళ్ళీ వస్తూ)

సాధు జనులతో వైరము స్పర్థలు

చేటని ఎంచవురా - నరుడా ll

ముక్కుమనిషి : నోరు మూసుకోరా గడ్డం సన్నాసీ !

(అవతలికి తోసేశాడు)

(యువకుడితో) నిన్ను ఏం చెయ్యాలి ? ఒరీ !

## ॥ సంవాద దరువు ॥

## ॥ సంవాదకీధృవ ॥

ఎంత మోసము చేసినావూర ! ఓరోరి యువకా ॥ ఎంత ॥
ఎంత మోసమ్మెంత మోసము
ఇంతకాలము మాతో కూడి
ఇంతలోనే వారి చేరగ ॥ ఎంత మోసము ॥

యువకుడు : నీతిమాలిన పనులకోసం
పావుగా నను వాడుకొంటే
ఎంతకాలం వూరుకుండేది - ఓ పెద్దలారా !
న్యాయమేదో మీరె చెప్పండి

ముక్కుమనిషి : టక్కరి మాటలు కట్టిపెట్టి మా పక్కకు రావోయు -
హఠించి నువు మాకెదురు తిరిగితే హర్షించము కాదోయి
ఓరోరి యువకా ఎంత మోసము చేసినావోరి ॥

పిచ్చిమారాజు : వెర్రి వెర్రి మాట లేలనురా - నీ పంతము జూడ
మోసగాడవు నీవె కావలెరా ॥

దొర : నువు రానంతె మర్యాద దక్కదు -
నువు మూర్ఖిస్తే నీ ప్రాణం నిలవదు ॥ ఓరోరి ॥

యువకుడు : ప్రాణభయం పేరు చెప్పి పాపాలను చేయించలేరు
మనసులున్న జనంతోటి మనగలిగితె అదే చాలు
బ్రతుకు విలువ తెలిసిన ఈ జనం మనిషిని
ఈ క్షణం నుంచి నేనింక మారాజు మనిషిని

(అందరూ ఆనందంగా చప్పట్లు కొడతారు ... దొర పక్కనున్న వాళ్ళకు సౌంజ్ఞ చేస్తాడు ... బొక్కసం వీరాస్వామి వాళ్ళ మీదకు వస్తాడు ... ముసలి పోలీసు వాళ్ళని భయపెడతాడు)

ముసలి పోలీసు : దౌర్జన్యం చెస్తే పోలీసు స్టేషనుకు తీసుకుపోవలసి వుంటుంది ... అనవసరంగా గొడవ చెయ్యక అడ్డం లేవండి -

దొర : మేమెవరమో తెలిసే మాట్లాడుతున్నావా ? జాగ్రత్త !

వీరాస్వామి : పదవయ్యా ముందు ... రాకపోతే ఈడ్చుకుపోతాం !

పడుచు పోలీసు : ఆ పిల్లాడి మీద చెయ్యి పడిందో జాగ్రత్త !

దొర : కానిస్టేబుల్ నువ్వెంత ? నీ తాహతెంత ? మమ్మల్ని ఎదిరిస్తున్నావ్ ?
నీ నెంబరెంత ? 15 నిముషాల్లో నిన్ను సస్పెండు చేయించకపోతే ...

ముసలి పోలీసు : సస్పెండ్ చేయిస్తావ్ ! చేయించు చూద్దాం - నా నెంబరు కావాలా ? 2222 - టౌన్ పోలీసు స్టేషను ... పేరు వెంకటస్వామి ... ఇంకా వివరాలు కావాలా ?

దొర : ఎంత పొగరురా మీకు ? ఇదంతా ఈ పిచ్చాడి ఆసరా చూసుకొనేనా ?

బసవయ్య : (ఆయన మీదికి పోతూ) ఏమన్నావ్ ? మళ్ళీ ఆమాట అను -

ముక్కుమనిషి : వంద సార్లంటాం ... ఈ పిచ్చాడి మాటలు విని మీరు కూడా కొవ్వెక్కితే!

బసవయ్య : (అతని దగ్గరకు పోయి, చొక్కా పట్టుకొని, వెనక్కి నెట్టి) ఒంకొక్క మాట మాట్లాడితే జాగ్రత్త (దొరతో) ఏయ్ ? నువ్వు అగ్గిలో చెయి బెడుతున్నావ్ ! జాగ్రత్త ! ఇంకోసారి ఈ వూరి వాళ్ళ నెవరినన్నా ఒక మాట అన్నావో -

దొర : ఏమిటీ ! నన్నా ! నన్నా అంటున్నావ్ ? ... చూస్తాను మీ సంగతి ... రేపు సాయంకాలానికల్లా మీరంతా నెత్తిన గుడ్డ వేసుకుపోవాల్సిందే ! వీరాస్వామీ ! కలెక్టరుకు ఫోన్ చెయ్యి ... ఎస్.పి. తో మాట్లాడు ... వీళ్ళకు నా తడాఖా చూపిస్తాను

**II ఆక్షేపకీధృవ II**

ధిక్కారముల్ సైతునా
కుటిల జనధిక్కారముల్ సైతునా ? II ధిక్కా II
నోటి మాటలూ నోట్ల మూటలూ
పెద్దల పరపతి డబ్బూ దస్కం
అన్నీ వున్న ఆసామిని నేను -
ఈ ధిక్కారముల్ సైతునా ?
వేలిముద్రల నుంచి ఫోర్జరీలకు ఎదిగి
పన్నెండు కోర్టుల్లో హత్యకేసుల నెదిరి
'నన్నెవ్వరాపలేరీ వేళ
నా వంక చూడలే రీవేళ'
అనుచు మీసం తిప్పి, ఢంకా బజాయించి నేతనై ఎదిగాను
ఇపుడు నే ధిక్కారముల్ సైతునా ?
పేరు లేని ఊరు లేని చెవులపిల్లి వెధవాయిలు
వీళ్ళంతా భయపెడితే - ధిక్కారముల్ సైతునా ?
ఊరు నాది భూమి నాది
అరువిచ్చే డబ్బునాది
పదవినాది పరువు నాది
భయపెట్టే కత్తి నాది
నేడు నాది, రేపు నాది
కలకాలం కొలువు నాది
లేని వాళ్ళు, కూలివాళ్ళు
చేవలేని బానిసోళ్ళు
వీళ్ళేనను ప్రశ్నిస్తే -
ధిక్కారముల్ సైతునా

కుటిల జన ధిక్కారముల్ సైతునా ॥

॥ సవాలు పద్యం ॥

॥ అంతరధృవ ॥

పిచ్చిమారాజు : ఓరీ ! దురహంకారీ !
ధిక్కారమ్ములు సైతునా యనుచు వ్యాధీభూత చిత్తముతో
వక్కాణించిన పోటుమానిసివహెూ ! నీ వాగర్థ ప్రాగల్భ్యముల్
నిక్కంబౌనొకొ ? నవ్వరే జనులిసీ ! నీవంటి దుర్మార్గులన్
చొక్కింపన్ శపథంబు చేసితిని, రా, చూపింతు మా ప్రజ్ఞలన్ ...
(అని మీదకు వెడతాడు ... దొర, అతని జనం కోపంగా నిష్క్రమిస్తారు)

## ॥ రేపటి స్వర్గం ॥

(ఆధునిక సంగీత నాటకము)

### ॥ మూడవ రంగం ॥

(ఊరు చివర బంగళా ... చాలా పాతకాలంది ... పురాతన కాలం నాటి కట్టడం ... లోపలి కుర్చీలు, అలంకరణలు కూడా 19 వ శతాబ్దాన్ని తలపుకు తెస్తున్నాయి ... టీకొట్టు తిరపతమ్మ, పూలపిల్ల అన్నింటినీ సర్దుతున్నారు ... పూలపిల్ల ప్రతి నిముషం వాకిలి వైపుకు చూస్తూ వుంటుంది ... టీకొట్టు తిరపతమ్మ ఇది గమనించింది)

### ॥ అనునయ గీతం ॥

### ॥ ప్రాసాదకీధృవ ॥

తిరపతమ్మ : కాంతా నేనొక కలగాంచితిని

కాంతుడు రాముడు కలలో కనపడె

అంతయు లేని కపులదోడ్కొని

అబ్ధిదాటె నా సద్గుణ స్తోముడు

చింతల దీరిచి రాక్షసులను చంపి

కాంతను సీతను గైకొన్నాడని ॥ కాంతా ॥

(పూలపిల్ల దిగులుగా టీకొట్టు తిరపతమ్మ భుజం మీద తల వాల్చింది ... ఆమె ఓదారుస్తుంది ... ఇంతలో వాకిట్లో నుంచి "అయ్యగారూ ! అయ్యగారూ !" అంటూ పిలుపు ... పూలపిల్ల వాకిట్లో చూసి మళ్ళీ గదిలోకి వచ్చి మరో గది వాకిలి దగ్గరకు పోయి పిలుస్తూ)

పూలపిల్ల : బాబుగారూ ! మన మేస్త్రీ నరసింహ వచ్చాడండీ ! ... మీరు రమ్మన్నారంటున్నాడు

పిచ్చిమారాజు : (బయటకు వచ్చి) వచ్చాడా ! ... రమ్మను ...

(నరసింహ వచ్చాడు ... పెద్దవాడు ... నెరిసిన గడ్డం ... బట్టతల)

నరసింహ : దండాలండి అయ్యగారూ !

(టీకొట్టు తిరపతమ్మ, పూలపిల్ల వెళ్ళిపోయారు)

పిచ్చిమారాజు : (నవ్వుతూ, దగ్గరకు వచ్చి) బాగున్నావా మేస్త్రీ ?

నరసింహ : బాబూ ! మేస్త్రీ పని మా తాతతోనే పోయింది ... అప్పటి మేస్త్రీలు ఇప్పుడు పని వాళ్ళయినారు బాబూ ! రైతులు కూలీలవుతున్నారు ... ఇప్పుడు మా పైవోళ్ళు ఏం పేరు పెట్టారో తెలుసా బాబూ ! పాకీవోళ్ళంట ! (నవ్వుతూ)

పిచ్చిమారాజు : (ఆగ్రహంతో) ఆమాట నా దగ్గర మరోసారి అనకు నరసింహా ... మనిషిని మరో మనిషి అగౌరవ పరిస్తే సహించలేను నేను !

నరసింహ : మీరేం చేస్తారు బాబూ ! ఇవన్నీ జరిగినప్పుడు మీరు లేరు బాబూ ! మా అయ్య అర్ధాంతరంగా సచ్చిపోతే ఈ కొలువులో పెట్టాడు మా మేనమామ ... తినడానికి తిండి కావాలి గనక కులవృత్తిని మానేసి ఈ ఉద్యోగంలో చేరాను బాబూ !

పిచ్చిమారాజు : ఎట్లా వున్నారు పిల్లా, పాపా ?

| | |
|---|---|
| నరసింహ : | అందరూ బావున్నారు బాబూ ! |
| పిచ్చిమారాజు : | నీ కొడుకు ? |
| నరసింహ : | బావున్నాడు బాబూ ... మళ్ళీ నా కొడుకు చేతికి తాపీ యిచ్చానయ్యా? ఇప్పుడు వాడు తాపీ మేస్త్రీ ! వాడికీ ఓ పిల్లాడయ్య ! వాడు బాగా చదువుతాడు బాబూ ! వాడూ తాపీ మేస్త్రీ అయితే ... |
| పిచ్చిమారాజు : | వాడు తాపీ మేస్త్రీ ఎందుకు కావాలి ? వాడు ఇంజినీరవుతాడు ! |
| నరసింహ : | మీ మాట చలవ బాబూ ! అయ్యాల మీరు బతికించి వుండకపోతే మా మొత్తం కుటుంబం ఈదిన పడేది బాబూ ! |
| పిచ్చిమారాజు : | భలేవాడివి నరసింహా ! ఆ రోజు నా దొడ్లో పడిపోయి వున్నావ్ ! నిన్ను ఇంట్లోకి చేర్చి డాక్టరును పిలిపించాను ... ఇందులో నేను చేసిందేముందోయ్ ! |
| నరసింహ : | భలేవోళ్ళు బాబుగారూ ! పదిహేను రోజులు ఓ మేస్త్రీ ముండావాడు మంచం మీదపడి ఉంటే అట్లాగే మంచం పక్క నుంచి కదల్లేదు తమరు - మా తాత అనేవాడు - మన చర్మంతో చెప్పులు కుట్టించినా ఆ బాబు రుణం తీర్చుకోలేమురా అని ! |
| పిచ్చిమారాజు : | నరసింహా ! ... ఆ రోజున మా యింటి వెనక నువ్వు స్పృహ తప్పిపడిపోయావు కదూ ? |
| నరసింహ : | అవును గద బాబూ ! |
| పిచ్చిమారాజు : | అప్పుడేం జరిగింది ? తరవాత చెబుతానని నాకు మాటిచ్చావు ! |
| నరసింహ : | అదంతా ఇప్పుడు ఎందుకులే బాబయ్యా ! ఈ సంగతులు తెలుసుకునే నేను కష్టాల్లో పడ్డానురా నరసింహా - అనేవాడు మాతాత! |
| పిచ్చిమారాజు : | మీ తాత ... వీరభద్రం ! ... ఈ యిల్లు కట్టి నాయన ! అల్లా అన్నాడా ? |
| నరసింహ : | అవును బాబూ ! 80 సంవత్సరాల నాటి మాట ! మీ తాతగారు ఈ జమీకి మారాజులు అయ్యా ! మా తాత మీ తాతగారు కలిసి ఒకే పంతులుగారి దగ్గర కలిసి చదువుకున్నారటయా ! మీ తాతగారికి చాలా మంది విరోధులుండేవాళ్ళుట బాబూ ! ఆయన దాయాదులు ఆయన్ని చంపాలని ఏవో కుట్రలు పన్నేరట ! ఓ రోజు మా తాతని పిలిచి, "వీరభద్రం ! నువ్వు నాకో సాయం చెయ్యాలి" అన్నార్ట మీ తాతగారు ... "చెప్పండి అయ్యా ! మీరడిగితే చెయ్యనా ?" అన్నాట్ట మా తాత ... "ప్రమాదం పొంచుకొని వుంది ... ఎవరెప్పుడు మమ్మల్ని హతమారుస్తారో తెలియకుండా వుంది ... అందుకనే ఓ కొత్త యిల్లు కట్టించాలనుకుంటున్నాను ... అందులో ఒక రహస్య మార్గం ఏర్పాటు చెయ్యాలి" అన్నార్ట ! "అయ్యా ! పాతాళ మార్గాలు అచ్చిరావు " అన్నాట్ట మా తాత ... "ససేమిరా" అన్నార్ట జమీందారుగారు ... వజ్రాలు, వైడూర్యాలు, ఏడు వారాల నగలు అన్నీ ఈ సొరంగం ద్వారా ఎక్కడో అడవుల్లో జాగ్రత్త చేశారని చేశారని చెప్పుకునే వారు బాబయ్యా ! |
| పిచ్చిమారాజు : | ఇవన్నీ నీ కెట్లా తెలుసు ? |
| నరసింహ : | మా యిళ్ళల్లో ఒక కట్టడి వుంది బాబూ ! ఇంటి పెద్ద పిల్లాడికి ఇంటి రహస్యాలన్నీ చెప్పి పోవాలని ! మా అయ్య చిన్నప్పుడు పోతే మా తాత మంచం మీద పడుండి నాకు అన్ని విషయాలు చెప్పాడు బాబూ! |
| పిచ్చిమారాజు : | మరి ఆ రోజు నువ్వు స్పృహ తప్పి పడిపోవడానికి దీనికి ఏమన్నా సంబంధం ఉందా ? |

నరసింహ : (బెంబేలుపడి చూస్తాడు) అయ్యా !

పిచ్చిమారాజు : నిజం చెప్పు !

నరసింహ : ఒద్దులే బాబూ ! మా తాత చాలా జాగ్రత్తలు చెప్పి చచ్చిండు !

పిచ్చిమారాజు : పిచ్చివాడా ! ఎవరికి చెబుతున్నావ్ ? ఇంటి యజమానికేగా ? పైగా ఇప్పుడది జరూరుగా తెలుసుకోవాలి ... ఆ రాత్రి ఏం జరిగిందో చెప్పు !

నరసింహ : ఆ రోజు ఇల్లంతా బావు చెయ్యమని నాకు అప్పగించి వెళ్ళారు గదయ్యా మీరు ! పనోళ్ళంతా దొడ్లో పనులు చేస్తున్నారు ... గోడలన్నీ మరక బట్టి వున్నాయి ... బావు చేద్దామని నేను ఒక్కణ్ణీ ఈ గదిలోకి వచ్చాను బాబూ ... ! తాపీతో ప్రతిరాయిని సాఫ్ చేసుకుంటూ వస్తున్నా ... ఒక గోడకున్న రాయి మీద కొడితే ఓటి మోత వచ్చింది ... ఏందబ్బా అని బలంగా కొట్టాను ... కొంచెం కదిలినట్టయింది ... అది వదులుగా ఉందేమోనని లాగాను ... రాలా ... మామూలు చోటికి లాగుదామని రాయిని గట్టిగా వత్తాను ... ఒక్కసారి ఫెళఫెళమంటూ పెద్దగా మోత వచ్చి గోడ విచ్చిపోయిందయ్యా ! కిందికి సొరంగ మార్గం కనిపించింది ... కాళ్ళు వణికాయి ... కాని మీరు ఊళ్ళో లేరు గందా ! ఎవ్వరూ చూడకుండా ఈ సొరంగం ఎక్కడి కెడుతుందో సూద్దామని బయలు దేరానయ్యా ! చీకటి గుయ్యారం ... పోయాను ... పోయాను ... ఓ గంట అయినంక దాహం వేసింది ... ఏం పట్టుకెల్ల లేదు ... నాలిక పిడచ కట్టుకుపోతోంది ... ఎనక్కు బయలు దేరాను ... మా తాత చెప్పిన మాటలు గాపకం వచ్చాయి ... ఎట్లా వచ్చానో తెలియదు మీ దొడ్డి వాకిట్లోకి వచ్చి పడిపోయాను !

పిచ్చిమారాజు : మరి నిన్ను లోపలికి తీసుకువచ్చి పడుకోబెట్టాం గదా ! మా కెవ్వరికీ ఆ సొరంగం కనిపించలేదేం ?

నరసింహ : బాబూ ఆ రాత్రి నా అవస్థ ఏం చెప్పను ? అర్ధరాత్రి భయంతో మెళుకువ వచ్చింది ... ఎట్లాగయినా ఆ సొరంగం ముయ్యాలి ... ఎట్లా ముయ్యాలో తెలియదు ... మీరంతా మీ మీ గదుల్లోకి పోయినంక, దేవుడి మీద బారం ఏసి అట్లాగే మెల్లగా మేడ మీద ఈ గదిలోకి వచ్చా ... ఆ రాయిని మళ్ళీ యధాపరకారం పెట్టి వత్తాను ... గట్టిగా వత్తాను ... మళ్ళీ తలుపు పడిపోయింది ... ఇప్పుడు తలుచుకున్నా నా గుండె దడదడ కొట్టుకుంటుంది బాబు !

పిచ్చిమారాజు : సొరంగ మార్గం ఎక్కడికి వెడుతుందిట ?

నరసింహ : నాకూ తెలియదు బాబూ ! ఎక్కడో కారడవి మధ్యలో ఓ దేవాలయం గర్భగుడిలో ఈ సొరంగం తేలుతుందని మా తాత చెప్పాడు !

పిచ్చిమారాజు : ఆ సొరంగ మార్గం ఎట్లా వుంటుందో నాకు చూపించు !

నరసింహ : (భయంతో) ఒద్దులే అయ్యా ! దాని వల్ల ఎవరికైనా ఏమైనా జరిగితే ఈ ముసలి పాణం హరీ మంటుందయ్యా !

పిచ్చిమారాజు : లోపలికి వెడితే తిరిగి రారంటావా ?

నరసింహ : అదేం లేదయ్యా ! పోగా పోగా ఆ కారడవికి చేరతాం !

పిచ్చిమారాజు : చూడు నరసింహా ! ఒక అత్యవసర కార్యానికి యిది అవసరం ... ప్రపంచాన్నే రక్షించడానికి యిది నేను తెలుసుకోవాలి ... కాదనకు !

(మేస్త్రీ నరసింహ సరేనని అన్ని గోడల్ని పరీక్ష చేసుకుంటూ వెడతాడు ... ఉత్తర వేపు గోడ మీద ఒక రాయిని కొడితే ఓటి మోత వచ్చింది ... మేస్త్రీ

నరసింహ మొహం విప్పారింది ... ఆ ప్రదేశాన్ని జాగ్రత్తగా పరిశీలించి రాళ్ళని కదిపి - అందులో ఒక రాయిని బలంగా నొక్కాడు ... ఫేళఫేళ ధ్వనితో సొరంగం తలుపు తెరుచుకుంది)

పిచ్చిమారాజు : ఏమిటీ మాయ ! ... రక్షించుకోవడానికి ఉపయోగపడిన ఈ ఉపాయం ఇపుడు శిక్షించడానికి ఉపయోగపడదా ? చూద్దాం (మేస్త్రీ నరసింహతో) నీకు ఈ వూరు వూరంతా కృతజ్ఞత చెబుతుంది నరసింహా !

నరసింహ : అయ్యా ! దీని వల్ల మీకేమీ కాకుండా ఉండాలని దేవుళ్ళకి మొక్కుతాను !

పిచ్చిమారాజు : ఈ విషయం మనిద్దరి మధ్యనే ఉండాలి సుమా ! ... తెలిసిందా ? ఎవరికైనా తెలిస్తే ఈ ఉరే సర్వనాశనం అవుతుంది ...

నరసింహ : బాబూ 70 ఏళ్ళ నుంచి గుట్టుగా కాపాడుకొస్తున్నానయ్యా ! ఇది మా మేస్త్రీల్లో కట్టడి బాబూ ! మీరేం బయం పెట్టుకోకండి ... బతికున్న వాళ్ళలో ఇది తెలిసిన వాళ్ళం ఇద్ధరమే బాబూ ! మీరు - నేనూ ! ...

(పిచ్చిమారాజు దగ్గరకు వచ్చి మేస్త్రీ నరసింహను ఆప్యాయంగా కౌగలించుకుంటాడు)

నరసింహ : వస్తానయ్యా ! (వెడుతూ మళ్ళీ తిరిగి వచ్చి) బాబుగారూ ! ఈ రహస్యం మా పిల్లోడికి సెప్పడానికి అనుమతివ్వండయ్యా ! పెద్ద కొడుకు వృత్తి రహస్యాలు తెలియాలని మా కట్టడి బాబూ ! ... వాడెవ్వరికీ చెప్పకుండా అమ్మోరి దగ్గర పెమానం చేయించుకుంటాను బాబూ ! ...

పిచ్చిమారాజు : అట్లాగే నరసింహా ! ... వెళ్ళిరా (మేస్త్రీ నరసింహ వెడతాడు)

(మేస్త్రీ నరసింహ వెళ్ళగానే - ఎవ్వరూ లేరని చూసి పిచ్చిమారాజు గోడ దగ్గరకు వెళ్ళి సొరంగం మూసేద్దామనుకున్నాడు ... తీరా అక్కడి దాకా వెళ్ళాక పూలపిల్ల మాట వినిపిస్తుంది)

పూలపిల్ల : అయ్యగారూ ! మంత్రి కేతినాయుడు గారూ, సేనాని మీసాల అప్పలరాజు గారూ వచ్చారండీ !

పిచ్చిమారాజు : (కాసేపు ఆలోచించి) ఊఁ ! ... ఇక్కడికే రమ్మను !

కేతినాయుడు : (వస్తూ) పిచ్చిమారాజు గారికీ బహుపరాక్ !

అప్పలరాజు : రాజుగారికి ప్రణామాలు !

పిచ్చిమారాజు : రండి ... రండి !

అప్పలరాజు : మాట వరసకైనా మహామంత్రి సేనానులకు ఆహ్వానం అనొచ్చుగా !

పిచ్చిమారాజు : ఇప్పుడు అంతఃపుర మర్యాదలకు సమయం లేదు ... ఇప్పుడు ఒక పెద్ద న్యాయ సంకటంలో పడ్డాం ...

(అప్పుడు చూశారు ... మంత్రి కేతినాయుడు, సేనాని అప్పలరాజు ... ఇద్దరూ సొరంగం)

ఇద్దరూ : ఇదేమిటి రాజా - ఇది -

పిచ్చిమారాజు : ష్ ! ఇది పాతాళ మార్గం ! సరాసరి కారడవుల్లో వున్న ఆంజనేయస్వామి గుడిలోకి వెడుతుంది ... అవసరార్ధం నేనే తెరిపించాను !

కేతినాయుడు : అయితే మన న్యాయ సంకటానికీ దీనికీ సంబంధం ?

(పిచ్చిమారాజు అవునని ఆడిస్తాడు ... మంత్రి కేతినాయుడు దీర్ఘ ఆలోచనలో పడ్డాడు)

సరే ! ఆ న్యాయ సంకటం ఏమిటో చెప్పు !

పిచ్చిమారాజు : ప్రపంచంలో ఉన్న పెద్ద పెద్ద నేరస్థులందరినీ - వాళ్ళు సామాన్యులు కాదు ... ప్రపంచాన్నే నాశనం చేద్దామని సంకల్పించుకున్నవాళ్ళు - వాళ్ళందర్నీ ఒక్క చోటికి చేర్చామనుకోండి ... వాళ్ళందర్నీ మట్టుపెట్టే పద్ధతి - అధమ పక్షం శిక్షించే ఉపాయం - మన దగ్గర ఉన్నదనుకోండి - అటువంటి శిక్షను అమలు పరచడానికి మనకు హక్కు ఉందా ?

కేతినాయుడు : తప్పకుండా ఉంది !

పిచ్చిమారాజు : అమ్మయ్య ! నా అనుమానం నివృత్తి అయింది !

అప్పలరాజు : నువ్వు న్యాయ శాస్త్రంలో నిధివని మాకు తెలుసుగాని - అంతమందిని, ఒక్కసారి !

కేతినాయుడు : మీరు యుద్ధంలో చేస్తున్నదేమిటి ? అందర్నీ ఒక చోటుకు చేర్చి చంపడం లేదూ ? పైగా అమాయకుల్ని ... పిచ్చిమారాజు నేరస్థుల్ని అంతం చయాలనుకుంటున్నాడు ... సబబైన ఆలోచనే ! ... మరి మీ నేరస్థులందరికీ న్యాయబద్ధమైన విచారణ జరిగిందా ?

పిచ్చిమారాజు : విచారణా ?

అప్పలరాజు : కేతినాయుడూ ! యుద్ధం వేరు ... ఇది వేరు ... అది దేశాలకీ దేశాలకీ మధ్య ఆధిపత్యం కోసం జరిగే పోరు ... ఇది అట్లా కాదుగా !

కేతినాయుడు : ఇది అన్యాయాలకీ అక్రమాలకీ వ్యతిరేకంగా జరిగే పోరు ... రాజా ! అన్యాయాన్ని మొగ్గలోనే తుంచెయ్యక పోవడం వల్ల అది ఎంతటి విషవృక్షమవుతుందో చూస్తున్నావుగా !

అప్పలరాజు : అవుననుకో ! అయినా శిక్షించే అధికారాన్ని వ్యక్తులు తీసుకుంటే దుర్మార్గులు దేశాన్ని మింగేస్తుంటే వాళ్ళు వాళ్ళు నాశనం చేస్తుంటే సామాన్యుల్ని తింటుంటే యింత కన్నా గత్యంతరం ఏమిటి ? ఎవరికి వాళ్ళు మాకెందుకులే అని వూరుకుంటే వీళ్ళింకా పేట్రేగిపోరూ ?

అప్పలారాజు : నిజమే ! వీళ్ళు ప్రభుత్వాలనే శాసించే స్థితికి వచ్చారు - హిట్లర్ లు, ముసోలినీ లు బయలుదేరింది అలానే కదా !

కేతినాయుడు : ఇటువంటి స్వార్థపరుల్ని మొగ్గలోనే తుంచెయ్యక పోవడమే ఇన్ని అరాచకాలకు కారణం ... రాజా ! నువ్వూ, నీ బలగం, బరిలోకి దిగాల్సిన సమయం యిది -

అప్పలరాజు : నిజమే కేతినాయుడు ! ఈ ప్రమాదకరమైన వ్యక్తులు కలిస్తే దేశాన్నే నాశనం చేయగలరన్నది తెలుస్తూనే వుంది ... ఏం చెయ్యాలో ఆలోచించండి !

కేతినాయుడు : అవును ... తగిన విచారణ లేకుండా ఎవ్వరినీ శిక్షించడం కుదరదు ... ప్రతి నేరస్థుడికీ - తాను నేరం చెయ్యలేదు - అని వాదించడానికి, దానిని నిరూపించడానికీ అవకాశం ఇవ్వాలి !

పిచ్చిమారాజు : కాని యీ నేరస్థులకు వాదించడానికి ఏ మాత్రం అవకాశం యిచ్చినా వాళ్ళు తప్పించుకుంటారు ... చట్టానికి దొరక్కుండా తప్పించుకోవడం వాళ్ళకి వెన్నతో పెట్టిన విద్య !

| | |
|---|---|
| కేతినాయుడు : | అయితే ఒక పని చెయ్యొచ్చు ... నేరస్థుల్ని మూడుసార్లు వారి పేర్లు పెట్టి పిలిచి వాళ్ళు కోర్టు లో హాజరు కాకపోతే కేసు వాదించమని ఒక వకీలును అడగవచ్చు ! |
| పిచ్చిమారాజు : | వకీలా ? ఇప్పుడు వకీలెక్కడ దొరుకుతాడు ? పైగా 30 నిమిషాల కన్నా ఎక్కువ వ్యవధానం లేదు ! |
| కేతినాయుడు : | వకీలు దొరక్కపోతే - దారిలో కనిపించిన ఎవరైనా వాదించడానికి పనికి వస్తారు ... వాదించాలి ... అదీ ముఖ్యం ... వాదన లేకుండా నేరస్థుడికి శిక్ష విధించకూడదు ! |
| పిచ్చిమారాజు : | ఎవరైనా వాదించవచ్చునంటే - మా మూగ బ్రహ్మయ్య ? |
| కేతినాయుడు : | మరీ అంత అసంబద్ధంగా ఉండకుడదు ! |
| పిచ్చిమారాజు : | పోనీ పోలీసు వెంకటస్వామి ? |
| కేతినాయుడు : | అతను పనికిరాడు - అతను ప్రభుత్వ పక్షం ! |
| పిచ్చిమారాజు : | మరి ? |
| కేతినాయుడు : | దోవలో తారాసపడే ఏ మనిషయినా పని కొస్తాడు ! |
| పిచ్చిమారాజు : | అమ్మడూ ! ... అమ్మడూ ! (పూలపిల్ల వస్తుంది) వాకిట్లో మనవాళ్ళు ఎవరెవరు ఉన్నారు ? |
| పూలపిల్ల : | మనవాళ్ళంతా ఉన్నారయ్యా ! |
| పిచ్చిమారాజు : | తుపాకి రాముడు కూడానా ? |
| పూలపిల్ల : | ఉన్నాడయ్యా ! |
| పిచ్చిమారాజు : | ఆఁ ! అదీ ! సీతారాముణ్ణి రమ్మను ! |
| | (తుపాకి రాముడు ... అతనితోపాటు జనం అంతా వస్తారు) |
| రాముడు : | దండాలు బాబూ ! దండాలయ్యా మహామంత్రిగారూ ! దండాలండి మీసాల అప్పలరాజు గారూ ! |
| అప్పలరాజు : | ఏమి సీతారాముడూ ! ఆయనేమో మహామంత్రిగారా ? నేనేమో అప్పలరాజునా? |
| రాముడు : | అదేమిటయ్యా ! మీసాల అప్పలరాజన్నాను గదండీ ! |
| అప్పలరాజు : | అదే అదే ! ఆయన్ని మహామంత్రీ అన్నప్పుడు - |
| రాముడు : | (నవ్వి) అట్లాగా ! దండనాథులు గారికి దండాలు, శతకోటి దండాలు ! |
| పిచ్చిమారాజు : | సీతారాముడూ ! ఒక కేసు నడుస్తున్నది (కేతినాయుడుని చూపిస్తూ) న్యాయమూర్తి ఎదుట ... ఈ కేసులో నిన్ను ప్రతివాది తరఫున వాదించె వకీలుగా ఉండాలని నిర్ణయించాం ! |
| రాముడు : | వాది తరఫునా ? |
| పిచ్చిమారాజు : | నేను వాదిస్తాను ! |
| రాముడు : | అమ్మ బాబోయ్ ! |
| కేతినాయుడు : | ఏమీ ఇబ్బంది ఉండదు ... నువ్వు రోజూ చెప్పే మాటలే ! |
| రాముడు : | అయితే - మహాప్రసాదం ! |

కేతినాయుడు : మొత్తం కేసులో న్యాయ నిర్ణయం అంతా నీ వాదన మీదే ఆధారపడి వుంటుంది !

పిచ్చిమారాజు : ఈ కేసులో నువ్వు ప్రపంచంలో ఉన్న పేరు పొందిన ధనవంతులు, అధికారులు, నాయకుల పక్షాన వాదించాలి ... వాళ్ళను గురించి నీకేమైనా తెలుసా ?

రాముడు : తెలుసా అంటున్నారా ? రూపాయి బిళ్ళలో బొరుసు ఎంత బాగా తెలుసో, వాళ్ళు అంత బాగా తెలుసు ... కాని నా దొక చిన్న మనవి ... నేను ప్రతివాదుల పక్షాన వాదించే వకీలుగా కాక, ప్రతివాదిగానే వాదిస్తే ఎక్కువ నిజాయితీగా ఉంటుందేమో ?

కేతినాయుడు : అభ్యంతరం లేదు ... ప్రాసిక్యూషన్ వారికి ?

పిచ్చిమారాజు : ఎంత మాత్రమూ అభ్యంతరం లేదు !

కేతినాయుడు : అయితే నువ్వు ప్రతివాదిగా నీ కేసును వాదించుకోవడానికి సిద్ధంగా ఉన్నావా ?

రాముడు : నేను ఎంత ధనవంతుణ్ణి ?

కేతినాయుడు : లక్షలు ... కోట్లు ...

రాముడు : ఎట్లా సంపాదించాను ? దొంగతం, దోపిడీ, మోసం, హత్య - ?

కేతినాయుడు : అన్నీ ...

రాముడు : నాకు పెళ్ళయిందా ? మంగళసూత్రం కట్టిన భార్యలెందరు ? కట్టకుండా –

(అందరూ నవ్వుతారు)

కేతినాయుడు : ఆ ప్రశ్న అసంబద్ధం ... అనుమతించబడదు ... విచారణ మొదలు పెడదాం ... (జనంతో) మీరంతా వచ్చి కూర్చోండి ... అమ్మడూ ! రాజుగారి కాలింగ్ బెల్ ఇక్కడ పెట్టు (పెట్టి యువకుడి పక్కనే కూర్చుంటుంది ... ముసిముసి నవ్వులతో)

కేతినాయుడు : ప్రతివాది బోనులోకి రావాలి !

(ఇద్దరు పోలీసులు వచ్చి ఓ డబ్బా పెట్టి దాని ముందు ఒక స్టూలు నిలబెడతారు ... తుపాకి రాముడు దాని మీద నిలబడతాడు)

రాముడు : (తన టోపీనే భగవద్గీతగా పట్టుకొని) నేను నిజమే చెబుతాను ... అబద్ధం చెప్పను !

అప్పలరాజు : అదేమిటి నువ్వు సాక్షివి కాదు ... ప్రతివాది ... నువ్వు అబద్ధం చెప్పాలి ... నిజాలు దాచి పెట్టాలి ... ప్రతి విషయాన్ని కలగాపులగం చెయ్యాలి !

రాముడు : అట్లా అయితే మరీ మంచిది ... నేను అబద్ధమే చెబుతాను ... నిజం చెప్పనని అన్ని సంగతుల్ని కలగా పులగం చేస్తానని ప్రమాణం చేస్తున్నాను (అందరూ నవ్వుతారు)

కేతినాయుడు : నిశ్శబ్దం ... అమ్మడూ ! నువ్వు ఇక్కడ కూర్చో ... నువ్వు కోర్టు గుమాస్తావి (అమ్మడు లేచింది) ఏయ్ పిల్లాడా ! నీ పేరేమిటో ?

పూలపిల్ల : చైతన్య (అని చెప్పి సిగ్గు పడుతుంది)

కేతినాయుడు : కోర్టులో సిగ్గు పడకూడదు ... చైతన్యా ! నువ్వు వచ్చి ఇటు కూర్చో ... నువ్వు అమీనావి ... (ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుంటారు) ఇహ కేసు ప్రారంభించండి !

రాముడు : మహా ఘనత వహించిన, మహా గౌరవనీయులైన కోర్టు వారికి సాష్టాంగ దండప్రనామంబు లాచరించి -

కేతినాయుడు : న్యాయ విచారణలో పొగ్తలేమీ సాయం చెయ్యవు ... సరే ! సరే ! ప్రతివాది వాదన విన్నట్టే - ఇప్పుడు వాది తరఫున న్యాయవాది క్రాస్ పరీక్ష చెయ్యవచ్చు !

పిచ్చిమారాజు : (లేచి) ప్రతివాదీ -

రాముడు : (టోపీ సర్దుకుని) సదా మీ సేవలో -

పిచ్చిమారాజు : మీ మీద తేబడిన అభియోగం ఏమిటో తెలుసా ?

రాముడు : నా మీద అభియోగమా ? కలలో కూడా జరగడానికి వీల్లేదు ... నా జీవితం తెరిచిన పుస్తకం ... నా వ్యవహారాలు జగద్విదితం ... నేను చేసే ధర్మ కార్యాలు!

పిచ్చిమారాజు : నువ్వు ధనానికి బానిసవని ... దానినే నిత్యమూ ఆరాధిస్తూ వుంటావని ... దాని సాధించడానికి ఏమైనా చేస్తావని నీ మీద అభియోగం ...

రాముడు : (కేతినాయుడి వంక తిరిగి) ప్రభూ !

కేతినాయుడు : నువ్వు నేరం చేశావా, చెయ్యలేదా ? - ఒక్క మాటలో చెప్పు (గద్దిస్తున్నట్లుగా) చెప్పు !

రాముడు : (అంతకన్న బిగ్గరగా) లేదు ... లేదు ... లేదు ... నేను డబ్బును పుజించడం ఏమిటి ? డబ్బే నన్ను పూజిస్తుంది ... నన్ను నెత్తి మీద పెట్టుకుంటుంది !

పిచ్చిమారాజు : ప్రతివాదీ ! నువ్వు ఇంత డబ్బును ఎట్లా సంపాదించావో కోర్టు వారికి నివేదించు !

రాముడు : నేను ... మొదటి సారి డబ్బును చూసింది ఒక రైలు పెట్టెలో - ఒక మాట - అందులో బంగారు ఇటికలు ... కళ్ళు జిగేలు మన్నాయి ... మీదా మీదా అని అడిగాను ... అందరూ దూరంగా దూరంగా జరిగి మాది కాదంటే మాది కాదు - అన్నారు ... దానితో ఒక కలకత్తా కంపెనీలో వాటాలు కొన్నాను ... ఆ తరవాత ఆ కంపెనీనే కొన్నాను ... ఆనాటి నుంచీ కంపెనీ షేర్లు కొనడం ... ఆ తరవాత ఆ కంపెనీనే కొనెయ్యడం ... ఈ పద్ధతిలో ఇవ్వాళ్టికి 14 కంపెనీలకు అధిపతిని (గద్గదికంగా) ఎంత ప్రయత్నించినా ఈ డబ్బు నన్ను వదలడం లేదు ... విధిని తప్పించడం ఎవరి తరమూ కాదని నేనే సర్దుకుపోతున్నాను ... నేను కోరేదల్లా ఒక్కటే ... నాకు మీ సానుభూతి వద్దు ... మీ దయాదాక్షిణ్యాలు వద్దు ... కాస్తంత సహృదయంతో అర్థం చేసుకోమని మాత్రమే అర్థిస్తున్నాను !

పిచ్చిమారాజు : అభ్యంతరం న్యాయమూర్తిగారూ ! ఈ అపరాధి కోర్టు వారి సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నాడు !

కేతినాయుడు : కోర్టుకు సానుభూతులుండవు !

రాముడు : నేను చెప్పదలచుకున్నదల్లా ఒక్కటే ! భాగ్యవంతులు భాగ్యవంతులు కావడం ఎట్లా వాళ్ళ స్వయంకృషో, అట్లాగే పేదవాళ్ళు పేదవాళ్ళుగా ఉండడం కూడా వాళ్ళ స్వయంకృతాపరాధమే !

పిచ్చిమారాజు : నువ్వు ధనం అంటే అంత నిరపేక్ష చూపిస్తూ వుంటే, దాన్నే అంటి పెట్టుకుని ఎందుకు వున్నావు ? ఎవ్వరికీ ఒక్క పైసా కూడా దానం చెయ్యవని నీ మీద అభియోగం !

రాముడు : నేనా ? ధనాన్ని అంటి పెట్టుకుని వుండడమా ? ఇంత కన్నా ఘోరమైన ఆరోపణ లేదు ... నేను ఎంత విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తానో గౌరవనీయులైన న్యాయాధిపతులు తెలుసుకోవాలి ...

నాకు మోటారు సైకిలుంటే కారు కొంటాను ... కారు ఆరు నెలలు పాతదైతే మరో సరికొత్త మోడల్ కొంటాను ... ఒక బంగళాలో మూడు నెలలుంటే మరో బంగళా కొంటాను ... ఒక భార్యను ఈ నెలలో కొంటే ... వచ్చే నెలలో (అందరూ నవ్వుతారు)

కేతినాయుడు : ఆర్డర్ ... ఆర్డర్ ...

రాముడు : పూల కోసం నా విమానం వెడుతుంది ... ఆపిల్స్ కోసం మరో విమానం కాశ్మీర్ వెడుతుంది ... ఎంత ఖర్చు చేసినా నా డబ్బు తరగనంటోంది ... అందుకే ఇవాళ నాకు 16 బంగళాలు, 24 వేసవి విడుదులు, 40 సహకార క్షేత్రాలు ఉన్నాయి ... ప్రపంచంలో నేను డబ్బుతో కొనలేనిదంటూ ఏమీ లేదు !

పిచ్చిమారాజు : డబ్బు - మనిషిని ఎటువంటి స్థితికి తీసుకుపోతుందో చూశారుగా !

రాముడు : నిజం ... డబ్బు లేకపోతే గౌరవం లేదు ... మిమ్మల్ని ఎవరూ నమ్మరు ... ఎవ్వరూ ఇష్టపడరు ... మీ దగ్గర డబ్బు ఉందనుకోండి ... మీ అంత నిజాయితీపరుడు గాని ... దయాగుణం ఉన్న వాడు గాని .... మేధావి గాని ... ఉండడు ... మిమ్మల్ని అందగాడంటారు ... కవులు మీ కావ్యగానం చేస్తారు ... అదే మీ దగ్గర డబ్బు లేకపోతే ...

పిచ్చిమారాజు : సరే ... సరే ! ఒక చివరి ప్రశ్న ... నువ్వు వెతుకుతున్న పెట్రోలు నిక్షేపాలు దొరికితే ఏం చేస్తావ్ ?

రాముడు : ఎంత అర్థం లేని ప్రశ్న ! పెట్రోలుంటే ఏం చేస్తాం ? యుద్ధం చేస్తాను ... ప్రపంచాన్నే జయించి నా పాదా క్రాంతం చేసుకుంటాను !

పిచ్చిమారాజు : న్యాయమూర్తిగారూ ! ... ప్రతివాది మాటలు విన్నారు ... ఆ మాటలు ఆధారంగానే ఆయన్ని అపరాధి అని తీర్పు చెప్పవలసిందిగా కోరుతున్నాను!

రాముడు : అపరాధా ? ఎవరు ? నేను ఎప్పటికీ అపరాధిని కాదు !

కేతినాయుడు : నిశ్శబ్దం !

రాముడు : నేనెప్పుడూ నిశ్శబ్దంగా ఉండను !

కేతినాయుడు : ఇది న్యాయస్థానం !

రాముడు : నేనే న్యాయాన్ని ... నేనే చట్టాన్ని ... నేను చెప్పేదే తీర్పు -

కేతినాయుడు : ఇహ ఏమీ చెప్పక్కర్లేదు ... వాదనలు పూర్తి అయ్యాయి !

పిచ్చిమారాజు : తీర్పు ఏమిటి ?

కేతినాయుడు : ముద్దాయి నేరం చేశాడని కోర్టు తీర్పు యిస్తున్నది !

పిచ్చిమారాజు : ఈ తీర్పు పరకారం ముద్దాయిని, లేదా ఇటువంటి ముద్దాయిలను ఎలాగయినా శిక్షించవచ్చుగదూ ?

కేతినాయుడు : నిరభ్యంతరంగా !

పిచ్చిమారాజు : ఆయనను అరణ్యవాసానికి పంపవచ్చుగా !

కేతినాయుడు : అరణ్యవాసానికేమిటి ? అజ్ఞాతవాసానికి కూడా పంపవచ్చు !

అందరూ : అవును ... అవును ...

పిచ్చిమారాజు : (ఇవతలకు వచ్చి యుపాకి రాముడితో) బ్రహ్మాండంగా వాదించావు !

రాముడు : కొంచెం ముందుగా తెలిసి వుంటే - ఇంకొంచెం ఘాటుగా ...

పిచ్చిమారాజు : ఇప్పుడు చెప్పిందే అద్భుతంగా ఉంది !

రాముడు : మీరు నేర్పిందే బాబుగారూ ! భాష మీది ! భావం మీది ! చెప్పే విధానం మీరు నేర్పింది ... చెప్పే ధైర్యం మీరిచ్చింది !

పిచ్చిమారాజు : న్యాయ నిర్ణయం వచ్చింది కనుక ఇహ మనం మన పనికి ఉపక్రమించాలి ... ఇక్కడి సామాన్లన్నీ సర్దండి ... ఈ లోగా ఇక్కడి కాస్త కిరసనాయిలు ఇటు యివ్వండి ... మేం ఇప్పుడే వస్తాం ... నీళ్ళలో కాస్త కిరసనాయిలు కలపండి ... ఆ టేబులు మిద ఉన్న నీళ్ళలో కూడా (అని స్నేహితులు ముగ్గురూ సొరంగం ద్వారా కిందకు వెడతారు ... అందరూ ఆశ్చర్యపడుతూ వుంటారు ... పూలపిల్ల, యువకుడు, టీకొట్టు తిరపతమ్మ, పాటకాడు బసవయ్య పనులు చేస్తూ పాట పాడుతున్నారు)

## ॥ అంతరధ్రువ ॥

తిరపతమ్మ : దేవతలు దైత్యులును అమృతంబు కొరకునై

ఇతరులు : తివిరి కడలి తరువగా -

అందు లోపల బుట్టె నమృతంబు లక్ష్మియును

అమరనుచ్చై శ్రవంబు

కౌస్తుభరత్నంబు ధన్వంతరియును మరి

గరళంబు వేడ్కబుట్ట -

సురలు దైత్యులు కడు భయమంద సాగిరి

గరళ కంఠుండంత గరళంబు మ్రింగెను ...

(పిచ్చిమారాజు, మంత్రి కేతినాయుడు, సేనాని అప్పలరాజు - ముగ్గురు స్నేహితులు వస్తారు)

(వీణ మీద గరళకంఠుండంత గరంఅంబు మ్రింగెను అని)

పిచ్చిమారాజు : మరి కొంచెం సేపట్లో ధనదాహంతో ప్రపంచాన్నే విషమయం చేసే మహా నాయకుల ఆగమనం - ఈ పిచ్చిమారాజు తన సహచర బృందంతో స్వాగతం - అతిథి మర్యాదలు - సత్కారం - అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉండండి!

అందరూ : మేము అందరం సిద్ధంగా ఉన్నాం !

పిచ్చిమారాజు : పెద్దలందరికీ దారి ఇదే ! (సొరంగం చూపుతాడు)

అందరూ : ఆఁ !

(వాకిట్లోకి ఆత్రంగా చూస్తూ వుంటుంది ... బయట వాహనాల చప్పుడు)

పూలపిల్ల : అయ్యగారూ ! అయ్యగారూ ! వచ్చేశారు ... వచ్చేశారు ... పెద్ద పెద్ద కార్లలో - చాలామంది

పిచ్చిమారాజు : బావుంది ... నేనే వాళ్లందరికి స్వాగతం చెబుతాను - స్వయంగా !

యువకుడు : బాబుగారూ !

పిచ్చిమారాజు : ఏమీ పరవాలేదు ... అమ్మడూ ! జ్ఞాపకం ఉంచుకో ! నాకు బ్రహ్మ చెముడు ... ఏమీ వినిపించదు ... నాకు వాళ్ళు మనసుల్లో నన్ను గురించి ఏమనుకుంటున్నారో వినాలని వుంది

(ఒక పిచ్చి నవ్వు నవ్వుతాడు)

పూలపిల్ల : అలాగే అయ్యగారూ !

(పూలపిల్ల వాకిలి దగ్గర నిలబడి వుంది ... వాకిట్లో కోలాహలం)

(బయట "పిచ్చిమారాజుగారి బంగళా ఇదేనా ?" అని ప్రశ్న)

పూలపిల్ల : అవును ... లోపలికి రండి దొరగార్లూ ! మీరు వస్తారని పిచ్చిమారాజు గారు ఎదురు చూస్తున్నారు ... ఇటు రండి ...

(ఒకే వేషంలో ఉన్న ముగ్గురు దొరలు ... సూటు బూటు హాట్ లతో - ఒకే నడకతో - నోట్లో సిగరెట్ లతో - ఒకే పద్ధతిలో నడుస్తూ ప్రవేశిస్తారు)

దొరలు : ఎక్కడ ఎక్కడ - పిచ్చిమారాజుగారెక్కడ ?

పూలపిల్ల : అక్కడ అక్కడ, పిచ్చిమారాజుగారక్కడ !

దొరలు : ఎక్కడ ఎక్కడ పెట్రోలు బావులు ఎక్కడ ?

పూలపిల్ల : పిచ్చిమారాజుగారికి చెముడు ... బిగ్గరగా మాట్లాడండి ... (బిగ్గరగా అరుస్తూ) రాజాధిరాజులు, బడా సంస్థల అధిపతులు గొప్ప గొప్ప దొరలు - వస్తున్నారహో !

దొర 1 : (పిచ్చిమారాజు దగ్గరగా వచ్చి) ఇవ్వాళ పొద్దున మిమ్మల్ని చూసినప్పుడే మనం మళ్ళీ కలుస్తామని నా మనసు చెప్పింది

(పిచ్చిమారాజు పిచ్చిగా నవ్వుతాడు)

దొర 1 : (మరి కొంచెం పెద్దగా) మా మీద మీరు చాలా నమ్మకం ఉంచారు ... మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియటం లేదు ... మీరు మీ అన్ని లావాదేవీలు మాచేతుల్లో పెట్టండి ...

దొర 2 : మరి కొంచెం బిగ్గరగా మాట్లాడు ... ఆ ముసలాయనకి వినబడదు !

దొర 1 : ఇదిగో ! మీ కోసం ఖరారు పత్రం !

దొర 2 : బిగ్గరగా ... బిగ్గరగా ...

దొర 1 : మీ యింటి భూగర్భంలో పెట్రోలు కనుక్కున్నారటగా !

(పిచ్చిమారాజు మళ్ళీ అట్లాగే నవ్వుతాడు)

దొర 1 : (ఆయన ముందు కాగితం పెట్టి, కలం యిస్తాడు) సంతకం ... సంతకం పెట్టడానికి -

పిచ్చిమారాజు : ఏమిటివి ? నేను కళ్ళజోడు పెట్టుకోలేదు !

దొర 1 : కాంట్రాక్టు -

పిచ్చిమారాజు : చాలా సంతోషం -

దొర 2 : (దొర 1 తో) ఏమిటా కాగితాలు ?

దొర 1 : అన్ని అధికారాలు మనకు బదలాయింస్తున్నట్టు ఒప్పందం !

(పిచ్చిమారాజు సంతకం పెడతాడు)

(ఆయనకు ఒక బంగారు యిటుకను యిస్తూ)

ఈ పెట్రోలు బావులు ఎక్కడున్నాయో చూపిస్తే ఈ బంగారు ఇటుక మీదే !

పిచ్చిమారాజు : ఏమిటిది ?

దొర 1 : (బిగ్గరగా) బంగారం - 24 కేరట్లు - మీ కోసమే !

దొర 2 : ఆ ముసలాయనిస్తావా యేమిటి ?

దొర 1 : మరి ? (నవ్వుతాడు) ఆగు ... ఆ చుట్ట ఆర్పేయ్ ... వెడుతున్నది పెట్రోలు బావి దగ్గరికి - (దొర 2 తన కంఠె ముందు పోతున్నాడు ... అతన్ని లాగి) నా తరవాత - (అని వెడతాడు ... మిగిలిన ఇద్దరూ - ఆయనని అనుసరిస్తారు)

పూలపిల్ల : (మళ్ళీ వాకిటి దగ్గర నిలబడి) భూగర్భ నిక్షేప గ్రాహకులు - ముక్కు మనుషులు ... వాసనా ధరీణులు వేంచేస్తున్నారహో ! (ముగ్గురు ముక్కు మనుషులు - దీర్ఘంగా వాసన పీలుస్తూ వస్తారు)

ముక్కుమనిషి : ఆహా ... ఏం వాసన !

ముక్కుమనిషి 1 : అబ్బ ! ఏం వాసన !

ముక్కుమనిషి : ఘాటుగా వుంది ... 60 శాతం పెట్రోలు ... గ్యారెంటీ !

ముక్కుమనిషి **1 : (**పిచ్చిమారాజును చూపితూ) ఆయనేనా ?

పూలపిల్ల : అవును ... ఆయనే పిచ్చిమారాజు గారు ... ఆయనకు పుట్టెడు చెముడు -

ముక్కుమనిషి : చెప్పారు గాదు ! ... అయితే మరీ మంచిది !

(అక్కడ టెబుల్ మీద మంచినీళ్ళుంటే కాసిని పోసుకొని వాసన చూస్తూ తాగుతాడు ... మిగిలిన ఇద్దరూ అలాగే చేస్తారు)

ముక్కుమనిషి : పెట్రోలే !

ముక్కుమనిషి **1 : 60** శాతం

ముక్కుమనిషి : వాసన, రుచి అమృత సమానం ! (పిచ్చిమారాజుతో) ఎట్లా తీశారు ? ఇంజన్లతోనా ?

పిచ్చిమారాజు : వేలుతో ...

(పిచ్చివాడి మాటలన్నట్లు ముక్కు మనుషులు ముగ్గురూ నవ్వుకుంటారు)

ముక్కుమనిషి : (కాగితాలు ముందు పెడుతూ) మీ సంతకం -

పిచ్చిమారాజు : ఏమిటిది ?

ముక్కుమనిషి : వచ్చే లాభాల్లో చెరిసగం వాటా !

(పిచ్చిమారాజు సంతకం చేస్తాడు)

ముక్కుమనిషి **1 : (**ముక్కు మనిషితో) ఏమిటిది ?

ముక్కుమనిషి : పిచ్చాసుపత్రికి పంపడానికి అప్లికేషను ... (నవ్వుకుంటారు)

పిచ్చిమారాజు : అదే దారి ...

(వాసన చూసుకుంటూ ముగ్గురూ వెడతారు)

(మళ్ళీ వాకిలి దగ్గర కోలాహలం ... పూలపిల్ల వెళ్ళి చూస్తుంది)

పూలపిల్ల : ప్రపంచాభిప్రాయ నిర్దేశకులు పత్రికా సంపాదకులు, విలేఖరులు - వస్తున్నారహో !

(అందరూ చంకలో సంచీలు ... చేతిలో సిగరెట్లతో ప్రత్యక్షం)

సంపాదకుడు 1 : మీ పరిచయ భాగ్యం లభించడం మా అదృష్టం ... ఈ దేశంలో ఎంతటి మహా మహులున్నారో ఈ వార్త నిరూపిస్తుంది !

సంపాదకుడు 2 : "పురాతన కట్టడాల్లో వెలిసిన పెట్రోలు బావులు" - ఇదీ - రేపటి మా పత్రిక పతాక శీర్షిక ... ఇంత ప్రచారం యిస్తున్నందుకు మాకు -

పూలపిల్ల : ఆయనకు బ్రహ్మచెముడు ... బిగ్గరగా మాట్లాడండి !

సంపాదకుడు 1 : మేం పత్రికా సంపాదకులం ... మా అంత శక్తిమంతులు ఈ దేశంలోనే కాదు ... ప్రపంచంలోనే లేరని మీకు తెలుసుగా ! మీ భవిష్యత్తు అంతా మా చేతుల్లో భద్రంగా ఉంది !

పిచ్చిమారాజు : చాలా సంతోషం !

సంపాదకుడు 1 : ఈయన దగ్గర కూడా మిగిలిన వాళ్ళ దగ్గర వసూలు చేస్తున్నట్టు 30 శాతం వసూలు చేద్దామా ?

సంపాదకుడు 2 : మనం గట్టిగా నిలదీస్తే ముసలాయన 40 శాతం కూడా ఇవ్వొచ్చు !

సంపాదకుడు 3 : ప్రతిపక్ష పార్టీలకు ప్రచార వ్యాసాలు వేస్తే తీసుకునే 50 శాతం తీసుకుందాం !

సంపాదకుడు 1 : ఇక్కడ సంతకం పెట్టండి ... ఈ కాంట్రాక్టు వల్ల మీకు సరికొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నాం ... ఇది ప్రతికల చలవే !

పిచ్చిమారాజు : ఇటు -

సంపాదకుడు 1 : దేనికి ?

పిచ్చిమారాజు : పెట్రోలు బావులకి !

సంపాదకుడు 1 : మేం చూడక్కర్లేదండి ... మేము చూడకపోతేనే బాగా రాస్తాం

పిచ్చిమారాజు : చూడకుండా ఎట్లా రాస్తారు ?

సంపాదకుడు 1 : కల్పనలో మాకున్న శక్తిని మీరు శంకిస్తున్నారు ... మా మెదడు సున్నితం ... కలం సునిశితం ... పెద్దలు మీరు అన్నారు గనక ఒక్కసారి చూసి వస్తాం ... మళ్ళీ తొందరగా వెళ్ళి పోవాలి ... 5 గంటలకి సి.యం. గారి ప్రెస్ కాన్ఫరెన్స్ ! ... వెళ్ళకపోతే నొచ్చుకుంటారు.

సంపాదకుడు 2 : స్వయంగా చూసి రాయాలంటే మా పారితోషికంలో 10 శాతం పెరుగుతుంది !

పిచ్చిమారాజు : అంత కంటేనా ? ఇటు (అని దారి చూపుతాడు)

సంపాదకుడు 1 : పోనీలేండి, పాపం ! ముసలాడు ముచ్చట పడుతున్నాడు ! ఒకసారి పోయొస్తే కలకాలం కలాల కనుసన్నల్లో ఉంటాడు ...

(ఆఖరి పత్రికా ప్రతినిధి వెడుతూ అక్కడ వున్న బంగారు బిస్కట్టును

సంచీలో వేసుకుని తీసుకుని వెడతాడు ... మిగిలిన వాళ్ళు వీడకుండా ... అందరూ లోపలకు వెళ్ళిపోయారు)

పిచ్చిమారాజు : అబ్బ ! ఏం గోల ! ఏం వెంపరలాట !

కేతినాయుడు : అనాగరిక జనం !

పిచ్చిమారాజు : ఇంకెవరన్నా వస్తున్నారా ?

పూలపిల్ల : రావడం లేదండి !

పిచ్చిమారాజు : అమ్మయ్య ... అంతా వెళ్ళిపోయారయ్యా ! ఇహ కమ్మగా గాలి పీల్చుకోవచ్చు !

అప్పలరాజు : అవిగో ! స్వేచ్ఛగా ఎగిరుతున్న పక్షులు !

అందరూ : పిచ్చిమారాజు కీ జై !

(ఎక్కడ నుంచో అజ్ఞాత వ్యక్తుల సమైక్య నాదం వినిపిస్తుంది ... 'పిచ్చిమారాజా! ... పిచ్చిమారాజా !' ... అంటూ)

మొదటి గొంతు : పిచ్చిమారాజా ! నేను పక్షిమిత్ర సంఘం కార్యదర్శిని ... మా సంఘం పక్షాన మీకు అభినందనాలు

రెండో గొంతు : మాది పశుమిత్ర సంఘం ... ప్రపంచ పరజలందరి పక్షాన మా కృతజ్ఞతలు ... మేం చేయాలనుకున్న ... చేయలేని పనిని మీరు సునాయాసంగా చేశారు !

అందరూ : ఇటువంటి భయరహిత, బాధారహిత ప్రపంచాన్నే మేం కోరుకుంటున్నాం.

పిచ్చిమారాజు : అయ్యా ! నేను చేసింది బహు స్వల్పం ... సామాన్య మానవుడె అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించాలి ... ప్రతీసారీ బయట నుంచి ఎవరో వచ్చి మనకు దారి చూపాలనుకోకూడదు ... మీలో ప్రతి ఒక్కరూ గళం విప్పి స్వేఛ్ఛాగీతాన్ని పాడాలి ...

చైతన్యా ! అమ్మడూ ! రండి ...

భయం, స్వార్థం నశించి కొత్త జీవితాన్నాసించే మీ యిద్దరి జీవితం నిర్భయతకు నాంది కావాలి ... మార్దవానికి, లాలిత్యానికి, మానవతకు మరో పేరు కావాలి ... సర్వ మానవ కల్యాణానికి ఇది మంగళ గీతం కావాలి

(అందరూ రంగస్థలం మీదకి వచ్చి కలిసి పాడతారు)

॥ మంగళం ॥

॥ నిష్క్రామకీధృవ ॥

మంగళమని పాడరే
మాన్యులందరు మీరు ॥ మం ॥
మంచీకి మమతాకు
మానవాళికి నేడు ॥ మం ॥
మంచి మనుషులు కూడి
మనసు మనసులూ కలిపి
ముందూకు నడచీన
ఈ భువినే స్వర్గము చేతురె
అదియె రేపటి స్వర్గమె
అదియే రేపటి స్వర్గమే ॥
మంగళమని పాడరే ॥

॥ శుభం ॥